

దర్శించండి - తరించండి

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం

కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.

సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం..

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి

శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్

A/c No. 30178925930, IFSC No. SBIN0010105

మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

సమగ్ర వార్తా దినపత్రిక

epaper : https://varthaprabha.com

Circulated Telangana & Andhra Pradesh States



“వార్తాప్రభ” కు, పాఠకులకు, శ్రేయోభిలాషులకు 24వ వార్షికోత్సవ శుభాకాంక్షలతో.....

రాచమల్ల పూర్ణచంద్రరావు, సర్పంచ్

మండవ సోమ విద్యాధర్ , పంచాయతీ కార్యదర్శి

పంచాయతీ కార్యాలయం - ఎనికేపాడు



| విజయవాడ VIJAYAWADA | సంపుటి : 24 | సంచిక : 124 | ది. 15-7-2025 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| | Vol.No : 24 | Issue No : 124 | Date : 15-7-2025 | Tuesday | Pages : 8 | Rs.1/- |


## మోడీ పోస్టుకు ఆ ఇద్దరే పోటీ..?



**న్యూఢిల్లీ ,జూలై 14 (వార్తాప్రభ) :** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి వచ్చే సెప్టెంబరు 17తో 75 సంవత్సరాల వయసు వస్తుంది. దీంతో ఆయనను పదవి నుంచి తప్పిస్తారని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఇటీవల బీజేపీ మాతృ సంస్థ ఆర్ ఎస్ ఎస్ లోనూ..ఈ తరహా చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది. 75 ఏళ్ల వయసు వచ్చాక.. పదవులు పట్టుకుని ఇంకా వేలాడడం కరెక్టు కాదని ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. ఇక, ఇప్పటి వరకు మోడీ చేసిన పనులు, తీసుకున్న చర్యలను గమనించినా.. 75 ఏళ్ల ఎఫెక్ట్ ఆయనను కూడా చుట్టుముడుతోంది. బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ లలో కీలకంగా వ్యవహరించిన.. మురళీ మనోహర్ జోషి, ఎల్ కే ఆద్వాణీ, కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప వంటి కీలక నాయకులను మోడీ హయాంలోనే %--% చూపిస్తూ.. పక్కన పెట్టారు. ఇప్పుడు తన దాకా వచ్చింది. ఈ క్రమంలో ఆయనంత ఆయన వ్యక్తిగతంగా తప్పుకొంటారో.. లేక ఆర్ ఎస్ ఎస్ జోక్యం చేసుకుని తప్పిస్తుందా? అనేది చూడాలి.ఇదిలావుంటే.. ఆర్ ఎస్ ఎస్‌లో దీనికి సంబంధించిన కీలక పరిణామం ఒకటి చోటు చేసుకుంది. మోడీ కనుక ప్రధాన మంత్రి పోస్టు నుంచి తప్పుకొంటే.. తర్వాత ఆ పదవిని చేపట్టే సామర్థ్యం ఉన్నవారు ఎవరు? అనే విషయంపై అంతర్మథనం చేపట్టారు. ఈ ఏడాది అక్టోబరు 2తో ఆర్ ఎస్ ఎస్ కూడా 100వ సంవత్సరంలోకి అడుగు పెడుతోంది. దీంతో ఈ సంస్థకు కూడా చీఫ్‌ను ఎంపిక చేయాల్సి ఉంది. ఈ పరిణామాల క్రమంలో తాజాగా ఆర్ ఎస్ ఎస్ భేటీ అయి.. ఈ విషయంపై చర్చించినట్టు తెలిసింది. దీని ప్రకారం.. మోడీ పోస్టుకు ఇద్దరు కీలక నాయకుల పేర్లను ప్రతిపాదించారని తెలిసింది. ఒకరు మహారాష్ట్రకు చెందిన ప్రస్తుత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ. మరొకరు ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, ప్రస్తుత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. ఇద్దరూ కూడా.. ఆర్ ఎస్ ఎస్ నుంచి వచ్చిన వారే. పైగా.. ఇద్ద రూ కూడా సీనియర్ మోస్టు నాయకులు, గతంలో బీజేపీకి జాతీయ స్థాయి నాయకత్వం కూడా వహించారు. వీరిద్దరూ ప్రస్తుతం మోడీ తర్వాత.. ప్రధాని పోస్టుకు పరిశీలనలో ఉన్నట్టు ఆర్ ఎస్ ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. అధికారికంగా దీనిపై ఎలాంటి ప్రకటనా రాలేదు. కానీ.. మార్పు కనుక నిశ్చయం అయితే.. రాజ్‌నాథ్, గడ్కరీలలో ఒకరికి ఖచ్చితంగా పోస్టు దక్కే అవకాశం ఉంటుందన్న చర్చ అయితే.. ఆర్ ఎస్ ఎస్ తెరమీదికి తెచ్చింది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# పేదల జేబులు గుల్ల కాకూడదు...ఆరోగ్యం దెబ్బతినకూడదు

## అందుకోసమే దేశంలో ఎక్కడా లేని విధంగా మద్యం ధరల తగ్గింపు

- కొత్త విధానంతో అక్రమ మద్యానికి చెక్....పెరిగిన ప్రభుత్వం ఆదాయం
- ఎక్సైజ్ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఇతర రాష్ట్రాలతో పోల్చితే మన దగ్గరే బ్రాండెడ్ మద్యం ధరలు తక్కువన్న అధికారులు
- నాణ్యత లేని మద్యం పోవడంతో... ప్రజారోగ్యంలో వచ్చిన మార్పును లెక్కించమన్న సిఎం



**అమరావతి,జూలై 14 (వార్తాప్రభ) :** మద్యం విధానంలో పారదర్శకతే ప్రధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు. ఈ అంశంపై ఎలాంటి రాజీ లేదని ఆయన తేల్చి చెప్పారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో అబ్కారీ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న బ్రాండ్ల విక్రయాలన్నీ నిలిపివేయాల్సిందిగా ఆయన ఆదేశాలు జారీ చేశారు. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు, నాణ్యత ఉన్న మద్యం విక్రయాలు మాత్రమే జరగాలని ఆయన అధికారులకు తేల్చి చెప్పారు. ప్రజల ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాటు సారా విక్రయాలు జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రజారోగ్యంపై ప్రభావం పడకుండా నాణ్యమైన మద్యాన్ని మాత్రమే విక్రయించేలా చూడాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున నకిలీ బ్రాండ్లు విక్రయాలు ఆంధ్రప్రదేశ్ లో జరిగాయని తద్వారా ప్రజల ఆరోగ్య పాడైందని అన్నారు.

**నకిలీ బ్రాండ్లతో ప్రజారోగ్యంపై ప్రభావం..** నకిలీ మద్యం బ్రాండ్ల కారణంగా ట్రేడ్ డైవర్ట్ అయ్యిందని తద్వారా రాష్ట్రం ఆదాయం కోల్పోయిందని అన్నారు. అదే సమయంలో ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతిందని సీఎం అన్నారు. 2014 నుంచి 19 మధ్య అమలైన మద్యం పాలసీ ఎలా ఉంది.. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన విధానం పై అధ్యయనం చేసి నివేదికను ప్రజల ముందు ఉంచాలని సీఎం స్పష్టం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక అమలు చేసిన నూతన మద్యం పాలసీతో ఏపీ రెవెన్యూ పెరిగిందని స్పష్టం చేశారు. గతంలో పొరుగు రాష్ట్రాలకు తరలిపోయిన ఆదాయం ఇప్పుడు రికవరీ వచ్చిందని అన్నారు. గతంలో జే బ్రాండ్ల కారణంగా గంజాయికి, డ్రగ్స్ కు అలవాటు పడ్డారని ..ప్రజారోగ్యంపై తీవ్రంగా ప్రభావం పడిందని అన్నారు. అలాగే స్వార్థం కోసం గత పాలకులు తెచ్చిన సొంత బ్రాండ్లు ఇప్పుడు కనిపించకుండా పోయాయని అన్నారు. ప్రజలు కూడా దీన్ని గుర్తించారని అన్నారు.

**మార్కెట్ లో ఉన్నవి ప్రముఖ బ్రాండ్లే..** గత ప్రభుత్వ హయాంలో విక్రయించిన నకిలీ మద్యం బ్రాండ్లను ఎంత వరకు అరికట్టారని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాసిరకమైన బ్రాండ్లు ఇంకా ఏమైనా మార్కెట్ లో కొనసాగుతున్నాయా అని సీఎం ఆరా తీశారు. గతంలో విస్తృత స్థాయిలో విక్రయించిన అనామక మద్యం బ్రాండ్లు నూతన పాలసీ అమలు పూర్తిగా తగ్గినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం అన్ని ప్రముఖ బ్రాండ్లు ఇప్పుడు మార్కెట్ లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. గతంలో మార్కెట్లో 68 శాతం మేర అనామక బ్రాండ్లకు చెందిన మద్యమే అందుబాటులో ఉండేదని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆ నాసిరకం బ్రాండ్ల విక్రయం జరక్కుండా చూస్తున్నామని అధికారులు సీఎంకు తెలియచేశారు. దేశీయ, విదేశీ కంపెనీలకు చెందిన ప్రముఖ బ్రాండ్లన్నీ ఏపీ మార్కెట్ లో కొనుగోలు దారులకు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

**చరిత్రలో తొలిసారి తగ్గిన మద్యం ధరలు..**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీ అమలు అనంతరం అబ్కారీ శాఖ చరిత్రలో తొలిసారి మద్యం ధరలు దిగి వచ్చాయి. మద్యం పై గతంతో పోలిస్తే కనీసం రూ.10 %-% 100 వరకూ ధరలు తగ్గినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పేద ప్రజల జేబులు కొల్లగొట్టేలా ప్రభుత్వం వ్యవహరించకూడదు, దోపిడీ ఉండకూడదు అనే ఉద్దేశ్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా మద్యం ధరలు తగ్గించామని సిఎం అన్నారు. ఈ కారణంగా ప్రతీ నెలా కొనుగోలు దారులపై రూ. 116 కోట్ల రూపాయల మేర భారం తగ్గుతుందని అధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు తో పోలిస్తే ఏపీలో విక్రయిస్తున్న టాప్ 30 బ్రాండ్ల మద్యం ధరలు తక్కువగా ఉన్నాయన్నారు. మరోవైపు పర్మిట్ రూమ్ లను అనుమతించే అంశంపై కమిటీ అధ్యయనం చేసిన అనంతరం నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పర్మిట్ రూంలు లేకపోవడం వల్ల ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగుతున్నారని...ఇది సమస్యలకు కారణం అవుతుందని అధికారులు వివరించారు. దీన్ని నివారించేందుకు పెద్ద ఎత్తున కేసులు నమోదు చేస్తున్నా...పూర్తి గా నివారించ లేకపోతున్నామని...పర్మిట్ రూంలు ఇచ్చి...అక్కడి వరకే పరిమితం చేస్తే మంచిది అధికారులు వివరించారు. అలాగే పర్యాటక రంగానికి ఊతమిచ్చేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లోనూ మైక్రో బ్రూవరీలను అనుమతించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఎక్సైజ్ ఐ ద్వారా డేగకన్ను పెట్టండి..** అబ్కారీ శాఖ లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అమలు చేసి ట్రేస్ అండ్ ట్రాకింగ్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## గోదావరి నీళ్లు ఇవ్వలేదు... కానీ ముఖ్యమంత్రి వస్తే అడ్డుకుంటామని చెబుతున్నారు: రేవంత్ రెడ్డి



**సూర్యాపేట,జూలై 14 (వార్తాప్రభ) :** తిరుమలగిరిలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం, గుర్తింపు, ఆకలి తీర్చే ఆయుధమన్న రేవంత్ రెడ్డి పదేళు అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ కు సన్నబియ్యం ఆలోచన రాలేదని విమర్శలు ప్రతిపక్ష నేతలు అధికారంలో ఉన్నప్పుడు గోదావరి నీళ్లు ఇవ్వలేదని, కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి వస్తే అడ్డుకుంటామని చెబుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో నిర్వహించిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం, గుర్తింపు, ఆకలితీర్చే ఆయుధమని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు రేషన్ కార్డు, సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన బీఆర్ఎస్ నేతలకు రాలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం 3.10 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తే రేషన్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయం దండుగ కాదని, పండుగ అని చెప్పడానికి గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇచ్చినట్లు చెప్పారు. దేశం తలెత్తుకునేలా వరి ధానం ఉత్పత్తి చేస్తున్నామని అన్నారు. గతంలో మూడు రోజులు అధికారం ఇస్తే తుంగతుర్తికి జలాలు తీసుకువస్తామని చెప్పారని, కానీ పదేళ్లు అధికారంలో ఉండి దేవాదుల నుంచి నీళ్లు తేలేకపోయారని విమర్శించారు.

## సీనియర్ నటి సరోజాదేవి కన్నుమూత



**బెంగుళూరు, జూలై 14 (వార్తాప్రభ) :** సీనియర్ నటి సరోజాదేవి (87) కన్నుమూశారు. బెంగళూరులోని తన నివాసంలో సోమవారం ఉదయం ఆమె తుదిశ్వాస విడిచారు. తెలుగు, కన్నడ, తమిళ సినిమాల్లో సరోజాదేవి నటించారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్‌ల వంటి దిగ్గజ నటులతో పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించారు. 1942 లో కర్ణాటకలో జన్మించిన సరోజాదేవి 13 ఏళ్ల వయసులోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 200కు పైగా సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో ఇంటికి దీపం ఇల్లాలు, మంచి చెడు, దాగుడు మూతలు వంటి హిట్ సినిమాల్లో నటించి అభిమానులను సొంతం చేసుకున్నారు.


**మహారాజశ్రీ విజయవాడ 2వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టులో**

O. S. No. 138/2025

Between:

వాగిచర్ల ప్రవల్లిక వగైరా

-------వాద్లు

And

షేక్ హుస్సేన్ వగైరా..

------ప్రతివాద్లు

TO.,

1) షేక్ హుస్సేన్
S/o లేటు షేక్ ఇమామ్ సాహెబ్,
2) షేక్ అబ్దుల్ నూర్,
S/o లేటు షేక్ ఇమామ్ సాహెబ్,
3) షేక్ నూరుద్దీన్ బాషా,
S/o లేటు షేక్ ఇమామ్ సాహెబ్,
1to3 అడ్రస్ : జవహర్ ఆటోనగర్, విజయవాడ-7 ఎన్టీఆర్ జిల్లా.
4) మహమ్మద్ గాలిబ్
S/o మహబూబ్ అలి, డోర్.నెం. 4-161/2, గొల్లపూడి గ్రామం, విజయవాడ రూరల్ , ఎన్టీఆర్ జిల్లా

-------1to4 ప్రతివాద్లు

మీలో 4వ ప్రతివాది 1to3 ప్రతివాదుల GPA Holder గా దావాలో 5వ ప్రతివాది అయిన గొల్లపూడి గ్రామ పంచాయితీ పేర వ్రాయించి రిజిష్టరు చేయించిన 29-12-2008వ తేదీ గల దస్తావేజు నెం.5547/2008 గల దఖలు దస్తావేజును చెల్లదని డిక్లరేషన్ నిమిత్తం మరియు సదరు దస్తావేజు రద్దు నిమిత్తం మరియు consequential పర్మనెంటు యింజంక్షను ఉత్తర్వుల నిమిత్తం వాద్లు మీపై దాఖలు చేయించిన పై నెంబరు దావాలో మీ హాజరు నిమిత్తం 30-7-2025వ తేదికి వాయిదా అయివున్నది. కాబట్టి మీరు సదరు 30-7-2025వ వాయిదా తేది ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనని యెడల దావా మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలంగా తెలియపరచడమైనది.

ఇట్లు
**ఏ.బాలాజీ, అడ్వకేట్**
కృష్ణలంక, విజయవాడ-13
సెల్ : 9848463889

విజయవాడ
11-7-2025


## గోవా గవర్నర్ గా అశోక్ గజపతిరాజు

- నేడు రెండు రాష్ట్రాలకు గవర్నర్ల నియామకం
- ఓ కేంద్ర పాలిత ప్రాంతానికి లెఫ్టినెంట్ గవర్నర్ నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**న్యూఢిల్లీ,జూలై 14 (వార్తాప్రభ) :** టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్ గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. ఇవాళ రెండు రాష్ట్రాలకు గవర్నర్ లను, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి లెఫ్టినెంట్ గవర్నర్‌ను నియమించారు. గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు, హర్యానా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషింకుమార్ ఘోష్, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తాలను కేంద్రం నియమించింది. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని రాష్ట్రపతి భవన్ అధికారికంగా ప్రకటించింది. విజయనగరానికి చెందిన అశోక్ గజపతి రాజు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సీనియర్ నాయకుడు మరియు పొలిట్ బ్యూరో సభ్యుడు. గతంలో ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేశారు.రాజకీయంలో నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న ఆయన, విజయనగరం రాజవంశానికి చెందిన ప్రముఖ వ్యక్తి. ఆయన గోవా గవర్నర్‌గా నియమితులవడంపై టీడీపీ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక, హర్యానా గవర్నర్‌గా ఇప్పటివరకు బండారు దత్తాత్రేయ సేవలందిస్తూ వచ్చారు. ఆయన స్థానంలో ప్రొఫెసర్ ఆషింకుమార్ ఘోష్‌ను కేంద్రం నియమించింది. విద్యారంగంలో ప్రముఖుడైన ఘోష్, ఈ కీలక పదవిని చేపట్టనున్నారు. అలాగే, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తా నియమితులయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి గవర్నర్‌లుగా పనిచేసిన వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర వంటి పెద్ద రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల్లో 20 మంది తెలుగు వారు గవర్నర్‌లుగా సేవలందించారు. వీరిలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన ప్రముఖులు కూడా ఉన్నారు.

## బీసీ గురుకులాల్లో యోగా టీచర్ ను నియమించండి

- కేంద్రమంత్రి ప్రతాప్ రావు జాదవ్ కు మంత్రి సవిత వినతి



**అమరావతి,జూలై 14 (వార్తాప్రభ) :** బీసీ హాస్టళ్ల విద్యార్థుల అదనపు రోగ నిరోధ శక్తి పెంపుదలకు కేంద్ర ఆయూష్ శాఖ ఆమోదించిన ఆయుర్వేద మూలికలతో తయారు చేసిన పౌడర్ ను అందజేయడానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత కోరారు. బీసీ గురుకుల పాఠశాలల్లో యోగా టీచర్ నియమించాలని కేంద్రమంత్రిని కోరారు. రెండ్రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా మొదటి రోజైన సోమవారం న్యూఢిల్లీలోని కేంద్ర ఆయూష్ శాఖ కార్యాలయం లో కేంద్రమంత్రిని మంత్రి సవిత కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని బీసీ హాస్టళ్ల విద్యార్థులకు ముఖ్యంగా కిషోర వయస్సు బాలికలకు అదనపు రోగ నిరోధక శక్తి పెంపొందించడానికి అశ్వగంధ, శతావరి, బ్రాహ్మి, తులసి, శంఖపుష్పి వంటి ఆయుర్వేద మూలికలతో తయారు చేసిన పౌడర్ ప్యాకెట్లను అందజేయాలని నిర్ణయించామన్నారు. కేంద్ర ఆయూష్ శాఖ ఆమోదించిన ఈ పౌడర్ ను అందజేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ పౌడర్ ను వినియోగించడం వల్ల విద్యార్థుల్లో పోషకాహార లోపాల నివారణతో పాటు రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని, మానసిక అభివృద్ధి, ఏకాగ్రత మెరుగవుతుందని తెలిపారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా మొదటి విడతలో విజయనగరం, అనంతపురం, కర్నూలు బీసీ హాస్టళ్ల విద్యార్థులకు ఈ పౌడర్ ప్యాకెట్లు అందజేయాలని కేంద్రమంత్రిని మంత్రి సవిత కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్య భద్రతతో కూడిన భోజనం అందించాలని సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దీనిలో భాగంగా, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల మధ్యాహ్న భోజనం పథకంలోనూ, అన్ని సంక్షేమ హాస్టళ్లలోనూ విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం అందిస్తోందన్నారు.

**యోగా టీచర్ ను నియమించండి...** యోగా వల్ల ఎంతో మేలు కలుగుతుందని, ముఖ్యంగా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండే అవకాశముందని మంత్రి సవిత తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోని బీసీ గురుకుల పాఠశాలల్లో యోగా టీచర్ నియమకానికి అనుమతివ్వాలని కేంద్రమంత్రి ప్రతాప్ రావు జాదవ్ ను కోరారు. యోగా టీచర్ల ఆర్థిక నిర్వహణ కేంద్రమే భరించేలా చూడాలని ఆ వినతిపత్రంలో మంత్రి సవిత తెలిపారు.

## డేగ కన్నుతో గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం

- ప్రభుత్వం, హోమ్ శాఖ, ఈగల్ టీమ్ సమిష్టి కృషితో ,మంచి ఫలితాలు సాధించాం
- గంజాయి హబ్ గా పేరొందిన ఉత్తరాంధ్ర ఏజన్సీని కాఫీ బ్రాండ్ గా తీర్చిదిద్దాము
- రాష్ట్ర హోం మరియు డిజాస్టర్ శాఖ మంత్రి వంగలపూడి అనిత



**అమరావతి, జూలై 14 (వార్తాప్రభ) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో వారి సూచనలు, సలహాల మేరకు డేగ కన్నుతో గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపి గత ఏడాది కాలంలో మంచి ఫలితాలను సాధించడం జరిగిందని రాష్ట్ర హోం మరియు డిజాస్టర్ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ప్రభుత్వం, హోం శాఖ మరియు ఈగల్ టీమ్ సమిష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ రాష్ట్రం నుండి గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండే ఒక యజ్ఞాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందులో బాగంగా విద్య, వైద్య, ఎక్సైజ్, గిరిజన సంక్షేమం మరియు హోం శాఖల మంత్రులతో ప్రభుత్వం ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ నేతృత్వంలోఅమరావతి హెడ్ క్వార్టర్ తో పాటు రాజమహేంద్రవరం మరియు విశాఖపట్నం కేంద్రాలుగా ఈగల్ టాస్కు ఫోర్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా 26 జిల్లాల్లో ఈగల్ సెల్స్ ను ఏర్పాటు చేసి గంజాయి, డ్రగ్స్ నియంత్రణకై పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అన్ని ప్రముఖ కేంద్రాల్లో చెక్ పోస్టులు, సిసి కెమేరాలు పెట్టి గంజాయి సాగును, రవాణాను నియత్రించడం జరిగిందన్నారు. గత ఏడాది కాలంలో దాదాపు 831 కేసులను బుక్ చేసి 2,114 మందిని అరెస్టు చేయడమే కాకుండా 23,770 కేజీల గంజాయిని, 27 లీటర్ల హాషిష్ ఆయిల్ ను సీజ్ చేయడం జరిగిందన్నారు. 293 వాహనాలను కూడా సీజ్ చేశామన్నారు. గంజాయి సాగును ప్రోత్సహించే కింగ్ పిన్స్ పై దృష్టి సారించడమే కాకుండా వారి ఆర్థిక లావాదేవీల ఆధారంగా ఏడుగురికి చెందిన రూ.7.75 కోట్ల ఆస్తులను కూడా సీజ్ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఆపరేషన్ గరుడ లో భాగంగా దాదాపు 100 జాయింట్ టీమ్ లు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మెడికల్ షాపులపై దాడులు నిర్వహించి డ్రగ్స్ అండ్ కాస్మొటిక్ యాక్టు-1940 ని ఉల్లంఘిస్తున్నట్లుగా 150 మెడికల్ షాపులను గుర్తించి సీజ్ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఒడిస్సా లింక్డు 27 రైళ్లల్లో ఈగల్ టీమ్స్ జాయింట్ రైల్ బేస్డు ఆపరేషన్స్ నిర్వహించి ఆరుగురిని అరెస్టు చేయడమే కాకుండా 37 కేజీల గంజాయిని, 152 గంజా చాక్లెట్స్ ను సీజ్ చేయడం జరిగిందన్నారు. గతంలో గంజాయి, డ్రగ్స్ కు హబ్ గా ఆంధ్రప్రదేశ్ మారిపోయిందని ప్రక్క రాష్ట్రాల డిజిపిలే విమర్శించే వారన్నారు. అయితే ఇప్పుడు రాష్ట్రంలో అటు వంటి పరిస్థితులు లేవని, గంజాయి హబ్ గా పేరొందిన ఉత్తరాంధ్ర ఏజన్సీ ప్రాంతాలైన అరకు, పాడేరు నేడు అత్యుత్తమమైన కాఫీకి బ్రాండ్ గా మంచి పేరు పొందాయన్నారు. ప్రపంచంలోని పలు దేశాలతో పాటు పార్లమెంట్ లో కూడా అరకు కాఫీ అవుట్ లెట్స్ ను పెట్టి ఎంతగానో ప్రమోట్ చేయడం వల్ల ఇది సాధ్యమైందన్నారు. అదే సమయంలో ఈగల్ టాస్కు ఫోర్సెస్, ఈగల్ సెల్స్ ద్వారా 325 హాట్ స్పాట్ స్టాట్ గ్రామాల్లో గంజాయి సాగును నియంత్రించడమే కాకుండా, గిరిజనుల జీవనోపాధికై 35 వేల ప్రత్యామ్నయ పంటల సాగుకై గత ఏడాది కాలంలో దాదాపు 40 లక్షల మొక్కలను పంపిణీ చేస్తూ తగిన ఆర్థిక సహాయాన్ని కూడా అందించడం జరుగుచున్నదన్నారు. ఈ ఏడాది 2 కోట్ల మేర మొక్కలను పంపిణీ చేసే లక్ష్యాన్ని నిర్థేశించుకోవడం జరిగిందన్నారు. ఏఎస్ఆర్ జిల్లాలో 94.77 ఎకరాల్లో గంజాయి సాగును రూపుమాపి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకై 31,185 మొక్కలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. దాదాపు 8,200 అవగాహన శిభిరాలను నిర్వహించి గంజాయి సాగు వల్ల సంభవించే పరిణామాలు, ప్రభుత్వ పరంగా తీసుకుంటున్న కఠిన చర్యలను అమాయకులైన గిరిజనులకు వివరించడం జరిగిందని ఆమె తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలు, కళాశాలల్లో దాదాపు 40 వేలకు పైగా ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేసి విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కల్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల లో ఆషాడ మాసం గోరింటాకు సంబరాలు





**దంతాలపల్లి జూలై 14 (వార్తా ప్రభ)**మండల కేంద్రంలోని దాట్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ఆషాడ మాస గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో ఈ వేడుకను జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు గోపు అనిత కుమారి, కే కవిత మాట్లాడుతూ విద్యార్థులకు ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించడం జరిగింది.గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలోని వేడి తగ్గించి శరీరాన్ని చల్లబరుస్తుందని, చర్మవ్యాధుల భారీ నుండి కాపాడుతుందని, గోర్ల బలోపేతానికి కృషి చేస్తుందని , ఒత్తిడిని తగ్గించడానికి శరీర శక్తిని సమతుల్యం చేయడానికి సహాయపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ కే పాషా, ఉపాధ్యాయులు చింతల సురేష్, జి అనిత, కే రవీందర్, కే కవిత , స్కావెంజర్ ఉమా , విద్యార్థులు పాల్గొన్నారు.

# 'బహుజనగణమన' దీర్ఘ కావ్యం ఆవిష్కరణ



**విజయవాడ పశ్చిమ జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాజకీయ, ఆర్థిక, సామాజిక, న్యాయరంగాలలో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ సుప్రసిద్ధ కవి జూలూరు గౌరీశంకర్ రాసిన 'బహుజనగణమన' దీర్ఘ కావ్యాన్ని సోమవారం విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద వున్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ ఆవిష్కరించారు. అనంతరం కలిమిశ్రీ మాట్లాడుతూ – బీసీలు పాలితులు కాదు పాలకులుగా నిలవాలన్న బహుజన చైతన్యం ప్రతి బీసీ ఎదలో నింపేందుకు ఈ గ్రంథం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ చొప్పా రాఘవేంద్రశేఖర్, సుప్రసిద్ధ కవి, రచయిత చిత్రాడ కిషోర్ కుమార్, సుప్రసిద్ధ చిత్రకారుడు పావులూరి చిదంబరేశ్వరరావు, ప్రసిద్ధ పోటోగ్రాఫర్ వై.డి.ఆనంద్, కడప నుండి వచ్చిన విద్యుత్శాఖ ఉద్యోగి జయన్న పాల్గొన్నారు.

# అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపండి.....

**అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించ వహించకండి....**

**జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ**



**విజయవాడ, జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో వచ్చే అర్జీదారులకు వారి సమస్యలను సావధానంగా విని అ ర్జీ దా ం ు ం సంతృప్తిచెందేలా సమస్యలకు పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీలను పరిష్కరించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు రెవిన్యూ పరమైన అంశాలతో పాటు భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరు, పెన్షన్ ల మంజూరు తదితర అంశాలతో కూడిన వినతులను సమర్పిస్తారన్నారు.

**176 అర్జీల స్వీకరణ:**రెవెన్యూ శాఖకు సంబంధించి 55, విద్య 27, పోలీస్ 25, ఎంఏయుడి 12, డిఆర్డిఏ 10,ఏపిఎస్డబ్ల్యూఆర్ఇఐఎస్ 4, పౌరసరఫరాలు 4, ఏపిసిపిడిసిఎల్ 4, హెల్త్ 4, పంచాయతీరాజ్ 4, ఇంటర్మీడియట్ 3, ఏపిఎస్ఆర్టిసి 2, విభిన్నప్రతిభావంతులు 2, పోల్యూషన్ కంట్రోల్ బోర్డు 2, జిఎస్డబ్ల్యూఎస్ 2, సర్వే 2, నేషనల్ హైవేస్ 2, సోషల్ వెల్ఫేర్, ఆర్డబ్ల్యూఎస్, కలెక్టరేట్ విద్య, పశుసంవర్ధక, ఉపాధి హామి, హౌసింగ్ మార్కెటింగ్, గనులు మరియు భూగర్భ, అటవీ, వ్యవసాయ, కో%-%ఆపరేటివ్, లీడ్ బ్యాంకు మేనేజర్ కు సంబంధించి ఒక్కొక్క అర్జీతో కలిపి మొత్తం 176 అర్జీలు స్వీకరించడం జరిగింది ఇందులో 81 అర్జీలు స్వయంగాను 95 అర్జీలు అన్లైన్ ద్వారా స్వీకరించిన్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కేఆర్సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి మండల, డివిజన్ స్థాయి అధికారులు వర్చువల్గా హాజరయ్యారు.

..............................

# సంకల్ప్ సే సిద్ధి కార్యక్రమం



**కుత్బుల్లాపూర్ జూలై 14 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి జీడిమెట్ల గ్రామం లో గాంధీ విగ్రహం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోది భారత ప్రధానిగా 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా "సంకల్ప్ సే సిద్ధి కార్యక్రమం" లో భాగంగా ప్రకృతి ఎన్విరాన్మెంట్ సొసైటీ (మూగ జయశ్రీ సీఈవో) సహకారంతో 500 మొక్కల పంపిణీ, మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, బీజేపీ 132 జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి, బీజేపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కన్వినర్ డా.ఎస్.మల్లారెడ్డి,గీతామూర్తి,విగ్నేష్,గిరివర్ధన్ రెడ్డి,శేఖర్ యాదవ్, ఎం.ఎస్.వాసు,శివాజీ,నటరాజ్ గౌడ్,డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు,విజయాందర్,మణికంత, తిరుపతయ్య,శంకర్ నాయక్,సంజీవ్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,వీరారెడ్డి,నార్లకంటి ప్రతాప్,చక్రి,జాన్సీ, మహేష్,ప్రవీణ్ గౌడ్, బలరాం,నాగదీప్ గౌడ్, అరవింద్,సతీష్, గంగాధర్,ఎశ్వంత్,పాపయ్య, జానకిరామ్,ప్రసాద్ శర్మ,రమేష్,బాలరాజు, రాజు,నవీన్ రెడ్డి,అంజయ్య, వీరేశం,నాగమణి,పద్మారెడ్డి ,కృష్ణవేణి,దీపిక, సోనీ,శ్రావణ్,రవీందర్ ,శ్రీనివాస్,శ్రీకాంత్,శ్రీను,శ్రవణ్, మూర్తి,హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య అన్నదాన సత్రంపై విచారణ చేపట్టాలి

**పలు పత్రికల్లో వస్తున్న కథనాలపై స్పందించిన సామాజిక కార్యకర్త**

**ప్రజావాణిలో ఆధారాలతో ఫిర్యాదు**






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కొత్తగూడెం, జూలై 14 భద్రాద్రి జిల్లా కేంద్రం సూపర్ బజార్ సెంటర్లో ఉన్న ఆర్యవైశ్య అన్నదాన సత్రం లోపాలపై సంబంధిత ప్రభుత్వ అధికారులు విచారణ చేపట్టాలని సామాజిక కార్యకర్త మురళి డిమాండ్ చేశారు. అన్నదాన సత్రం లోపాలపై ఇటీవల ఇటీవల పత్రికల్లో కథనాలు రావడం జరిగింది. ఈ కథనాలకు స్పందించిన సామాజిక కార్యకర్త మురళి భద్రాద్రి జిల్లా కలెక్టరేట్లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆర్యవైశ్య అన్నదాన సత్రంపై విచారణ జరపాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ కు ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త మురళి మాట్లాడుతూ కొత్తగూడెం పట్టణం ఎంజీ రోడ్డులో ఆర్య వైశ్య అన్నదాన పత్రం ఉందని ఈ సత్రాన్ని కొందరు దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. గతంలో ఈ సత్రంలోని నిత్య అన్నదానం జరిగేదన్నారు. 1933 సంవత్సరంలో బ్రిటిష్ కాలంలో ఈ సత్రం స్థాపించారన్నారు. కోపరేటివ్ సొసైటీ హైదరాబాద్ లో సత్రం 140/1960 నెంబర్ లో రిజిస్ట్రేషన్ అయిందన్నారు.అయితే ఈ సత్రానికి కమిటీ కూడా ఉందని తెలిపారు.2008 సంవత్సరం నుండి 2011 వరకు కమిటీ ఉందని ఆ తర్వాత నుండి కొత్త కమిటీ ఏర్పాటు కాలేదు అన్నారు. కొత్త కమిటీ ఏర్పాటు కాకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ఈ సత్రం ఆస్తి విలువ దాదాపు 200 కోట్లుగా ఉంటుందని చెప్పారు. అయితే తేదీ23-2-2004న ఆర్ సీ నెంబర్ 1/2004 ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ దేవాదాయ శాఖ ఖమ్మం అధికారులు సత్రంను పూర్తిగా ఎండోమెంట్ చేయమని అధికారులు సత్రం ఇన్చార్జిన కోరినట్లు కూడా సమాచారం ఉందన్నారు. ఈ సత్రం పరిధిలో చుట్టూ దుకాణాలు కూడా ఉన్నాయని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ పత్రంపై ఎలాంటి ఆడిట్ లేనందువ కొందరు కలిసి ఆర్య వైశ్య సత్రం నిధులను వారి సొంత అవసరాలకు వినియోగించుకున్నట్లుగా తెలిసిందన్నారు.కమిటీలోని కొందరు అక్రమాలకు పాల్పడుతున్నట్లు కూడా ప్రచారం ఉందన్నారు. సత్రానికి సంబంధించిన షాపులను సొంతంగా మార్చుకునేందుకు ఒక వ్యక్తి జీవో 76 ద్వారా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నట్లుగా ఆరోపించాడు.సత్రంపై వస్తున్న ఆరోపణలపై అధికారులు విచారణ జరిపి సత్రం ద్వారా నిత్య అన్నదానంతో పాటు 2008లో ఉన్న కమిటీ సభ్యులను కూడా విచారణ జరపాలని కోరారు. ఆర్యవైశ్య సత్రాన్ని అక్రమార్కులు దోచుకోకుండా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పథంలో కొనసాగే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు సత్రం ఎండోమెంట్ పరిధిలోని పూర్తిస్థాయిలో నడిచే విధంగా చూడాలని సామాజిక కార్యకర్త మురళి అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# ఉడత ఊపులికి ఇక్కడ ఎవరు బెదిరే వాళ్ళు లేరు..... ఎమ్మెల్యే బోడె



**కంకిపాడు జూలై 14 (వార్తా ప్రభ, ప్రతినిధి)**వైసిపి నాయకుడు జగన్ మోహన్ రెడ్డి, వాళ్ల నాయకులు మాట్లాడే ఉడత ఊపు బెదిరింపులకు ఇక్కడ ఎవరూ బెదిరే వాళ్ళు లేరని పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రమైన కంకిపాడులో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత నెల రోజులుగా వైసీపీ నాయకుడు, వాళ్ళ నాయకులు రప్ప రప్ప అంటూ ఒకరు, చీకటిలో కన్ను కొడితే మెడకాయలు తెగాలి అని రాష్ట్రంలో హింసను ప్రోత్సహించే విధంగా చేస్తున్న వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల పెంపకాన్ని బట్టి కొడుకు ఎదుగుదల, పార్టీ నాయకుడు బట్టి కార్యకర్తల ప్రవర్తన ఉంటుంది, నాయకుడు హింసను ప్రేరేపించే విధంగా వ్యవహరిస్తే నాయకులు, కార్యకర్తలు, అదే తీరులో ఉంటారని ఆరోపించారు. 151 సీట్లు ఉన్నాయని అహంకారంతో ప్రతిపక్షాలపై హింసాకాండ చేయటం వలన 11 సీట్లకు ప్రజలు పరిమితం చేసిన ఇంకా బుద్ధి రావడం లేదన్నారు. గుడివాడ,పెడనలో జరిగిన వైసిపి కార్యక్రమంలో ఒక నాయకుడు కొంగల మల్లన్నల గా వైసిపి అధికారంలోకి రాగానే అంతు చూస్తామంటూ కబుర్లు చెబుతున్నాడు. కొంగల మల్లన్న లెగిసేది లేదు వైసీపీ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో నాయకులకు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హింసను ప్రోత్సహించమని ఏనాడు చెప్పలేదు, హింస చేసేవాళ్లను, మహిళలను కించపరిచే వాళ్లను ఏ పార్టీ వారినైనా అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. అదే మా నాయకులు హింసను ప్రోత్సహించి, క్రమశిక్షణగా ఉంచకపోతే మీరు నోటికి వచ్చినట్టు మాట్లాడే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. నా గురించి అసత్య ప్రచారాలు చేసే వారికి గతంలోనే బుద్ధి చెప్పా అది తెలుసుకొని ఒళ్ళు దగ్గర పెట్టుకోని మాట్లాడాలన్నారు. ప్రజాసేవ, ప్రజా పాలన అంటే చంపడం, నరకడం కాదని పదవులు లేకపోయినా ప్రజా క్షేమం కొరకే పనిచేసేవాడే నాయకుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ అంటే తమ కార్యకర్తలు ప్రాణాలైనా ఇస్తారే కానీ క్రమశిక్షణ తప్పరన్నారు. కేవలం ప్రతిపక్ష హోదా కూడా లేకపోవడంతో అసహనానికి గురై సైకో ప్రవర్తనతో కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. నా గురించి అసత్య ప్రచారాలు చేసే వాళ్లకు సమాధానం చెప్పవలసిన పనిలేదు. ప్రజాక్షేత్రములో ప్రజలకే నేను జవాబు దారి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కళ్యాణి, సిహెచ్సి చైర్మన్ రోహిణి కుమారి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు,జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు ముప్పా రాజా, బిజెపి నాయకులు రోహిణి, శ్రీనివాసరావు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఋణం తీర్చుకుంటా

**తిరువూరు ఏఎంసీ డైరెక్టర్ గా అబినేని చంద్రశేఖర బాబు**

**విస్సన్నపేట జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తిరువూరు ఏఎంసీ డైరెక్టర్ గా నన్ను నియమించేందుకు విజయవాడ పార్లమెంటరీ సభ్యులు కేశినేని శివనాద్(చిన్ని), తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు మా బిజెపి అధిష్టానానికి ఆజన్మాంత0 ఋణపడి ఉంటానని నూతనంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించిన అబ్బినేని చంద్రశేఖర బాబు మీడియా సమావేశంలో తెలియజేశారు. నాకు పదవి రావడానికి ఈ అవకాశం కల్పించిన వారికి మచ్చ తెచ్చేలా చేయను కానీ కొందరు నా ప్రతిష్టను మంట కలిపేలా కుట్రలు పన్నుతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం సమాచారం అందుతుందన్నారు.కొందరికి తిరువూరు నియోజకవర్గంలో ఏఎంసీ డైరెక్టర్ వరమాల వారి మెడలో పడకపోవడంతో అందని ద్రాక్ష పళ్ళు పుల్లన అన్న చందంగా ఇలాంటి కుట్రలకు తెర లేపుతున్నారు కానీ నేను నాకిచ్చిన పదవీ బాధ్యతలతో కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని గడపగడపకు తీసుకువెళ్లి ప్రచారం చేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో నా వంతుగా కూటమి ప్రభుత్వానికి తిరువూరు నియోజవర్గ స్థాయిలో అధిక శాతం గ్రామ పంచాయతీలు విజయకేతనాలు ఎగరవేసేలా మనసా వాచా కర్మణా అంతఃకరణ శుద్ధిగా ఆత్మ ప్రబోధానుసారం చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు.

# పీఎంపీల సమస్య ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తా



**కాకినాడ జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పల్లెల్లో ప్రథమ చికిత్సలు అందించే పీఎంపీల గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో మాట్లాడి సమస్య పరిష్కారానికి,గుర్తింపు కొరకు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ హామీ ఇచ్చారు.శనివారం కాకినాడ లో ఎంపీ సానా సతీష్ బాబు ను కమ్యూనిటీ పారామెడిక్స్%డ%ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) కాకినాడ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పీఎంపీల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ సానా సతీష్ బాబు మాట్లాడుతూ పీఎంపీ లకు ఎప్పటినుండో ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకుని వెళ్ళి గుర్తింపుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కాకినాడ అధ్యక్షులు సీహెచ్ .ఏడుకొండలు, కార్యదర్శి కే శ్రీనివాసరావు, ఎన్.శ్రీనివాసరావు, ఎంవీ రవికుమార్, ఎండీ షాజుద్దీన్,పి వీరభద్రరావు,ఎస్. లక్ష్మణరావు,పిల్లి ఉదయ్ భాస్కర్,మధు తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

# స్మశాన స్థలాన్ని వదలని ఇసుక మాఫియా

**అక్రమ ఇసుక మాఫియా ను అరికట్టాలి**

**తాసిల్దార్ కి ఫిర్యాదు చేసినసిపిఎం నాయకులు**



**భద్రాద్రి కొత్తగూడెం జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్:-కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని వేపల గడ్డ గ్రామంలో ఎదుళ్ల వాగు దగ్గర లొ వున్నా స్మశాన వాటిక స్థలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తాసిల్దార్ కి ఫిర్యాదు చేసిన సుజాతనగర్ సిపిఎం నాయకులు ఈ సందర్భంగా మండల కార్యదర్శి వీర్ల రమేష్ మాట్లాడుతూ ఇసుక రవాణా ను అధికారులు అడ్డుకోకపోతే ప్రజలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున దీనిపై ధర్నా రాస్తారోకో చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నల్లగోపు.పుల్లయ్య,ఉడుగుల శ్రీకాంత్,బచ్చలికూర శ్రీను, శ్రీధర్ రాజు,కొంపల్లి అయిలయ్య, నాగరాజు,వెంకన్న తదితరులు పాల్గొన్నారు..

# నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే అభినందన.



**శేరిలింగంపల్లి,జులై 14 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు పిఏసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శాలువ తో సత్కరించి ప్రత్యేకంగా పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అభినందించారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం ప్రెసిడెంట్లు సాయిలు నాయి,సురేష్ నాయి ఉపాధ్యక్షులు పరుశురాం నాయి, జనరల్ సెక్రెటరీ రవీందర్ నాయి, ట్రెజరర్ శేఖర్ మరియు కార్యవర్గ సభ్యులు కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కే.యం. ప్రతాప్



**దుండిగల్ జూలై 14 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ గ్రామంలో, శ్రీశ్రీశ్రీ మహాగణపతి సప్త మాతృక సహిత దుర్గామాత ఆలయ కమిటీ వారు నిర్వహిస్తున్న దుర్గమ్మ బోనాల జాతరకు, వారి యొక్క ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్ విచ్చేసి దుర్గామాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ,దుర్గమ్మ తల్లి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలందరిని చల్లగా చూడాలని, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, అష్టైశ్వర్యాలు కలిగించాలని వేడుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, కుత్బుల్లాపూర్ మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు చినంగి వెంకటేశం ముదిరాజు, ఆలయ కమిటీ సభ్యులు, దుండిగల్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సిపిఐ మండల కార్యదర్శిగా కోమరి హనుమంతరావు ఏకగ్రీవం



**సుజాతనగర్: జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్ సిపిఐ 4వ మండల మహాసభ మండలం లోని సీతంపేట బంజారలో ఆదివారం నిర్వహించారు అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సుజాతనగర్ మండల కార్యదర్శిగా కోమరి హనుమంతరావు, సహాయ కార్యదర్శిలుగా తాళ్లూరు ధర్మారావు లావుడియా గోపి, కోశాధికారిగా ,మూడు గణేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా 24 మంది, మండల కౌన్సిల్ సభ్యులుగా 92 మంది ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు తమపై నమ్మకంతో పదవీ బాధ్యతలు ఇచ్చినందుకు ఋణపడి ఉంటామని సిపిఐ పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేస్తామని అన్నారు

# ఎడిటోరియల్

## ట్రోల్స్ చిక్కుల్లో పవన్ కల్యాణ్ ..!

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో ట్రోల్స్ ను ఎదుర్కొంటున్నారు. ఆయన చేస్తున్న ప్రసంగాలు, తీవ్ర విమర్శలు వంటివి నెటిజన్లకు ఆటపట్టుగా మారాయని చెప్పాలి. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క రకంగా మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్ వ్యవహార శైలి నిజానికి.. జనసేన నాయకులకు కూడా మింగుడు పడడం లేదనే చెప్పాలి. ఏదైనా ఒక విషయంపై మాట్లాడాల్సి వచ్చినప్పుడు చాలా జాగ్రత్తగా మాట్లాడాలి. అదేవిధంగా గతంలో మాట్లాడిన మాటకు ప్రస్తుతం మాట్లాడే మాటకు మధ్య పొంతన ఉండేలా చూసుకోవాలి.కానీ, ఈ విషయంలో పవన్ కళ్యాణ్ చాలా సందర్భాల్లో దారి తప్పుతున్నారనేది నెటిజన్లు చేస్తున్న ట్రోల్స్ ను బట్టి స్పష్టంగా తెలుస్తోంది. గతంలో హిందీ భాష పై తీవ్ర విమర్శలు గుప్పించిన పవన్ ఇటీవల కాలంలో మాత్రం హిందీని ప్రశంసిస్తున్నారు. బిజెపిని భారతీయ జనతా పార్టీ కాదని అది హిందీ జనతా పార్టీ అని పేర్కొన్న పవన్ కళ్యాణ్ గత ఎన్నికల సమయంలో బిజెపితో పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్లారు. దీనిపై అప్పట్లోనే ట్రోల్స్ వచ్చాయి. ఇక ఇటీవల కాలంలో హిందీని ఆయన పూర్తిగా భుజాల మీద ఎక్కించుకున్న పరిస్థితి ఉంది.బిజెపి నాయకుల కంటే ఎక్కువగా కూడా పవన్ కళ్యాణ్ హిందీ ప్రచారం చేస్తున్నారనే మాట సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తోంది. హిందీని ఒకప్పుడు విమర్శించిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు హిందీ నేర్చుకుంటే తప్పేముంది.. దీనివల్ల మనకి కమ్యూనికేషన్ పెరుగుతుందని చెప్పుకొస్తున్నారు. త్రిభాషా సూత్రాన్ని సమర్థిస్తున్నారు. ఒకప్పుడు ఇదే పవన్ కళ్యాణ్ త్రిభాషా సూత్రాన్ని తీవ్ర స్థాయిలో ఎండగట్టారు. విమర్శించారు. బీజేపీ నాయకులపై తీవ్రస్థాయిలో విమర్శలు కూడా గుర్తించారు.కానీ.. ఇప్పుడాయన దాన్ని సమర్థిస్తున్నారు. ఇక, సనాతన ధర్మం విషయానికి వస్తే ఈ విషయంలో కూడా పవన్ కళ్యాణ్ విమర్శలు పాలయ్యారు. ఒకప్పుడు తనకు మతం లేదని కులం లేదని తాను సిద్ధాంతాలకు మాత్రమే విలువ ఇస్తానని చెప్పారు. ఈ క్రమంలోనే చేగువేరా.. లెనిన్ వంటి వారిని తనకు ఆదర్శంగా చెప్పుకొచ్చారు. అంతేకాదు తన ఇంట్లో తల్లి మాత్రమే పూజలు చేస్తారని తన తండ్రి సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ఉంటారని ఆయన పలు సందర్భాల్లో 2014-19 చెప్పుకొచ్చారు.కానీ, తిరుపతి లడ్డు విషయంలో కావచ్చు తిరుపతిలో జరిగిన తొక్కిసలాట అంశంలో కావచ్చు ఆయన పూర్తిగా సనాతన ధర్మానికి మద్దతిస్తూ కాషాయ వస్త్రాలు ధరించి ఏకంగా దీక్ష కూడా చేశారు. ఈ పరిణామం కూడా పవన్ కళ్యాణ్‌ను ట్రోల్స్‌కు గురయ్యేలా చేసింది. ఇక మరో ముఖ్య విషయం.. తను పుట్టి పెరిగిన ప్రాంతానికి సంబంధించి ఒక్కొక్క వేదికపై ఒక్కొక్క రకంగా చేస్తున్న వ్యాఖ్యలు కూడా నటిజెన్లకు ఆటవిడుపుగా మారింది. ఎక్కడికి వెళ్తే అక్కడ ఆయన నేనిక్కడ పుడితే బాగుండేది అని వ్యాఖ్యానించడం.. గతంలో తను కర్నూల్ లో పెరిగానని, నెల్లూరులో పుట్టానని, పాలకొల్లులో చదివానని ఇట్లా రకరకాలుగా ఒక సంబంధం లేనటువంటి వ్యాఖ్యలు చేయడం పట్ల నెటిజన్లు పదేపదే ట్రోల్స్ చేస్తున్నారు.సరే దీనివల్ల ఏం జరుగుతుంది? ఏదో మా నాయకుడు ఇలా అన్నంత మాత్రాన మాకు ఒరిగేది ఏంటి%--% అని కొంతమంది జనసేన నాయకులు అనుకుంటే అనుకుని ఉండొచ్చు. కానీ, ఒక కీలక పార్టీకి అధినేతగా ఉన్న వ్యక్తి, పదేపదే ఇలా ట్రోల్స్‌కు గురి అయితే రేపు ప్రజల్లో ఆయన పట్ల వ్యతిరేక భావన పెరిగే అవకాశం ఉంటుందన్నది పరిశీలకుల అంచనా. కాబట్టి, భవిష్యత్తులో మాట్లాడేటప్పుడు గానీ, ప్రసంగాలు చేసేటప్పుడు గాని ఒకటికి రెండుసార్లు ఆలోచించుకుని అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. ఒక పార్టీ అధినేతగా పవన్ కు ఇది చాలా ముఖ్యమైనది పరిశీలకుల భావన.

## జనసేన సభ్యత్వం క్రియా కిట్లు అందజేసిన ఎమ్మెల్సీ.



**కలిదిండి జులై 14 (వార్తా ప్రభ)**ఏలూరు జిల్లా.కైకలూరు నియోజకవర్గం.కలిదిండి మండలం,శాసన మండలిసభ్యులు జయమంగళ వెంకట రమణ మూలలంక గ్రామంలోని జనసేన పార్టీ ఆఫీసు వెళ్లి,మూలలంక పంచాయతీ లో జనసేన సభ్యత్వం క్రియ కిట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో కలిదిండి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బెల్లపుకొండ వెంకన్న బాబు మరియు మూలలంక గ్రామం జనసేన పార్టీ అధ్యక్షుడు యడ్ల కృష్ణా,శ్రీను,తాడి ఇంద్ర, అందె నెహ్రూ,నాగేంద్ర, రాంబాబు, వి శ్రీను, వి బాబూరావు, మరియు జనసేన కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## పెద్ద మనిషి హితోక్తులు



గాలిలోన దీపము
పెట్టుకుంటే నష్టము
చేతులతో దానికి
కాపునిస్తే లాభము
నీటి మీద రాతలు
వదరుబోతు మాటలు
నిర్మిస్తే నిలవవు
ఆకాశ హర్మ్యాలు
పనికిరాని కూతలు
నీచమైన చేతలు
హానికరం పరికింప
చెదరగొట్టు తలపులు
దుష్టులతో స్నేహము
అత్యంత ప్రమాదము
సజ్జనుల సహవాసము
బ్రతుకున మధుమాసము
అధికమైన కోపము
తెచ్చునోయ్ అనర్ధము
జీవితాన శాంతము
తలపించును నాకము
పెంచుకోకు ద్వేషము
ఆదిలోన త్రుంచుము
చేయబోకు పాపము
చివరికదే దాస్యము

**గద్వాల సోమన్న,**
9966414580

# ప్రజలందరికీ, పోలీసులు కుటుంబాలకు, నిండుగా శ్రీ కనకదుర్గమ్మ ఆశీస్సులు ఉండాలి

- విజయవాడ నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు
- అమ్మవారికి ఆషాడం సారే సమర్పించిన పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు దంపతులు







**విజయవాడ పశ్చిమ జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రతి సంవత్సరం ఆషాడమాసంలో ప్రజలు, పోలీసు కుటుంబాలు ఆనందంగా, సుభిక్షంగా వుండాలని ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసుల ఆద్వర్యంలో విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి చీర, సారెను సమర్పించడం జరుగుతుంది.ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు దంపతులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఉన్న రావి చెట్టు వద్ద ఆనవాయితీ ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో కలిసి విజయవాడ పశ్చిమ డివిజన్ పరిధిలోని వన్ టౌన్ పోలీసు స్టేషన్ నుండి మేళ తాళాలతో అంగరంగ వైభవంగా బయలుదేరి శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి దేవస్థానంనకు చేరుకొని అమ్మవారికి ఆషాడం సారె సమర్పించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈ.ఓ. శీనా నాయక్ , దేవస్థాన అధికారులు ఆషాడం సారే తీసుకు వస్తున్న నగర పోలీస్ కమిషనర్ కి సాదరంగా ఆహ్వానం పలికి వేద పండితుల నడుమ సారే సమర్పణ అనంతరం వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించారు.ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ.... ప్రతి సంవత్సరం ఆషాడమాసంలో ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసుల ఆద్వర్యంలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాడం సారెను సమర్పించడం అనవాయితీగా జరుగుతుంది. పోలీస్ కుటుంబాలు మరియు ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు నిండుగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ తో పాటు డి.సి.పి.లు ఎ.బి.టి.ఎస్.ఉదయరాణి , ఎస్.వి.డి.ప్రసాద్, అడిషినల్ డి.సి.పి.లు గుణ్ణం రామ కృష్ణ , ఏ.వి.ఎల్.ప్రసన్న కుమార్ , పశ్చిమ ఎ.సి.పి. ఎన్.ఎస్.వి.కె.దుర్గా రావు , సెంట్రల్ ఏ.సి.పి. కె.దామోదర్ రావు, ఇనస్పెక్టర్లు, ఎస్.ఐ.లు సిబ్బంది మరియు పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసులను రాజకీయ పార్టీలు నాయకులు చేతుల్లో కీలుబొమ్మలుగా మారుస్తున్నారు

***అధికార రాజకీయ పార్టీలు,ప్రతిపక్ష రాజకీయ పార్టీల మధ్య చెరుకు రసం మిషన్లో పిప్పిలా నలిగేది పోలీసులే***

(యేమినేని వెంకట రమణ)

**విజయవాడ పశ్చిమ జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాజకీయ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు వారికి సభలు సమావేశాలకు ప్రోటోకాల్ ప్రకారం బందోబస్తు ఏర్పాటు చేయాల్సింది పోలీసులే.. సార్వత్రిక ఎన్నికల్లో అవాంచనీయ సంఘటన చోటు చేసుకోకుండా ....రిగ్గింగ్ జరక్కుండా తగినంత చర్యలు చేపట్టేదీ పోలీసులే...జెట్ క్యాటగిరి సెక్యూటి ఏర్పాటు చేసేదీ పోలీసులే..అవసరమైతే ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, తేడాలు లేకుండా బేడీలు వేసేదీ పోలీసులే..అలాంటి సత్తా ఉన్న పోలీసుల పరిస్థితి నేడు అత్యంత దయనీయంగా మారింది.అటు అధికార పార్టీలు నాయకులు, ఇటు ప్రతిపక్షాల నాయకులు మధ్య చెరుకు రసం మిషిన్ లో నలిగిపోయి పిప్పి లా మారేదీ పాపం పోలీసులే... అశోక ధర్మ చక్రం పై నలువైపులా ఉన్న నాలుగు సింహాల్లో న్యాయం, ధర్మం, చట్టం, కనిపించే మూడు సింహాలైతే..కనిపించన నాలుగో సింహమేరా ఈ పోలీసు అని ఓ సినిమా లో సినీ హీరో రాజశేఖర్ చెప్పిన డైలాగులు స్పూర్తితో ఒకప్పుడు పోలీసులు గర్వంగా మీసాలు మెలితిప్పిన రోజులన్నాయి. అదే పోలీసులు ఫవరేంటో చూపించిన “”అంకుశం””” సినిమా చూశాక అదే వూపుతో ఉమ్మడాంధ్రప్రదేశ్ లో పోలీసులు రొమ్ము విరుచుకొని విధులు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి.పోలీసు వ్యవస్థపై రాజకీయ నాయకులు పెత్తనం ఎక్కువై రానురాను పోలీసులంటే రాజకీయ నాయకులు చేతుల్లో కీలుబొమ్మలుగా మారే దుస్థితి ఏర్పడిందని చెప్పొచ్చు. ఏ రాజకీయ పార్టీలు అధికారంలో ఉంటే ఆ పార్టీ అధినేత మెప్పు కోసం ఆయన మౌలిక ఆదేశాలు అమలు చేయడంలో అతిగా ప్రవర్తిస్తున్న ఉన్నత స్థాయి పోలీసులు అధికారులు చట్టపరమైన విచారణ ఎదుర్కొంటున్నారు. రాజకీయ నాయకులు చదరంగం లో పోలీసులు పావులు గా మారుతూ అన్యాయం పాలౌతున్నారు. అధికార పార్టీ తొత్తులుగా పోలీసులు ప్రవర్తిస్తున్నారని ఆరోపించిన వారే తాము అధికారంలోకి వచ్చాక అదే పోలీసులతో వూడిగం చేయించడం ఆనవాయితీగా మారింది. పోలీసులను గుడ్డలు వూడదీపిస్తామని ఓ పార్టీ అధినేత బహిరంగంగా ప్రకటిస్తాడు...రానున్నది మా ప్రభుత్వమే నేను ఎక్కడున్నా.. నిన్నుమాత్రం వదలను నీ అంతు చూస్తా...నీతో జైలు ఊచలు లెక్కపెట్టిస్తా... నిన్ను వీ ఆర్ కి పంపిస్తా...అంటూ మరో నాయకుడు బెదిరింపు.. ఇలా కేవలం ఐదేళ్ళ పదవీ కాలాన్ని అడ్డగోలుగా దుర్వినియోగం చేసే రాజకీయ నాయకులు చర నుండి పోలీసులు మనోవేదనలు లేని స్వేచ్ఛా విధులు నిర్వహించే రోజులు రావాలి. రేయింబవళ్లు శాంతిభద్రతల పర్యవేక్షణ, ప్రజల మాన ప్రాణ ధన రక్షణ కోసం నిలువు కాళ్లపై పహారా కాసే పోలీసులకూ మానాభిమానాలు ఉంటాయని రాజకీయ నాయకులు గుర్తించాలి. ఓ లక్ష్యంతో నిద్రాహారాలు మాని తాము సొంతంగా ఎవ్వరి సిఫార్సు లేకుండా సాధన చేసి సాధించిన ఉద్యోగాల్లో ఉద్యోగం విరమణ వరకూ జీవితాలు త్యాగం చేసినా.. పోలీసులు ఐదేళ్ల కాలంలో అదీను ప్రజలు దాయాభిక్ష పై పదవులు పొందిన రాజకీయ పార్టీల నాయకుల ప్రమేయం లేని ప్రశాంత విధులు నిర్వహించే రోజులు రావాలని కోరుకొందాం....

# ఆకుల శ్రీనివాస్ కుమార్ నోట పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి సంక్షేమ పథకాలు పాట

- వైసీపీ ని విడనాడాలని ఆకుల శ్రీనివాస్ కుమార్ హితులు సన్నిహితుల సలహా
- ఇప్పుడు ఎన్డీయే కూటమిలో ఉన్న ఏ పార్టీలోకి చేరాలబ్బా...
- ఎటూ తేల్చుకోలేకపోతున్న ఆకుల

(యేమినేని వెంకట రమణ)



**విజయవాడ పశ్చిమ జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడలో కాపు సామాజికవర్గ ప్రముఖులు, ఒకనాటి నగర యూత్ కాంగ్రెస్ అద్యక్షుడు, రాజకీయ నాయకులు గా ఎంతోమంది హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఆకుల శ్రీనివాస్ కుమార్ ఎందువల్లనో మునిగిపోవడానికి సిద్ధంగా ఉన్న వైసీపీ నావనెక్కి ఉన్న పరువు పోగొట్టుకున్నాడని ఆయన స్నేహితులే నిట్టూర్పులు విడిశారు. ఇలాంటి తరుణంలో కేవలం 11 సీట్లుకే పరిమితమైన వైసీపీ లో కొనసాగడం అవివేకమే అవుతుందని ఆకుల వర్గీయుల అభిప్రాయం. ఐతే తనకంటూ అన్ని వర్గాలప్రజల్లో,అన్ని పార్టీల నాయకుల్లో ప్రత్యేక స్థానం వున్న ఆకుల ఏ పార్టీలో వున్నాగాని ఆయన డబ్బుకోసం పార్టీలు మారుతున్నాడనే అపవాదు మకిలీ ఇంకా ఆయనకు అంటలేదు. ఐతే ఆర్థికంగా ఎవ్వరిని ఆశ్రయించాల్సిన అవసరంలేని ఆయన ఏడాది క్రితం చేతికందొచ్చిన ఆకుల తనయుడు డాక్టరు ఆకుల రాజ్ కుమార్ బలవన్మరణం చెందడంతో ఆ షాక్ నుండి ఇంకా కోలుకోలేని స్థితిలో ఉన్నారు. అతని పరిస్థితి గమనించిన స్నేహితులు కొందరు. కొడుకు జ్ఞాపకాల నుండి బయట పడాలంటే ప్రజా సేవలో దృష్టి పెట్టాలని సలహా ఇచ్చారు. కోట్లాది మంది ప్రజలు ఆశలు పెట్టుకొని గతేడాది అఖండ మెజార్టీ తో పట్టం గట్టిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం మిత్ర పక్షం పార్టీల్లో చేరాలని ఆయనకు సలహా ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో చిరంజీవి పై ఉన్న అభిమానంతో ప్రజారాజ్యం పార్టీని బలపరిచిన ఆకుల కాలక్రమంలో చిరంజీవి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోగా చిరంజీవి మాటలు నమ్మి విజయవాడలో పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్యే అభ్యర్థి గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆర్థికంగా నష్ట పోయారు. ఆ తర్వాత వైసీపీ లో చేరి వ్యక్తిగతంగా ఆ మకిలి అంటించుకొన్నారు. నేడు ఇటీవలే ఓ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ సమక్షంలోనే కొత్తగా పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పాట ను అందుకున్నారు. ఆయన మాట్లాడిన తీరు ఆయన వాలకం చూస్తుంటే ఆకుల చూపు ఎన్డీయే కూటమి వైపు అన్నట్లుగా ఉందనే అనుమానం కలుగుతోంది. సుజనా చౌదరి ఎన్నికల ముందు ఎన్డీయే కూటమి లో చేరండి అనే పిలుపునిచ్చారు. కానీ ఎన్నడూ బీజేపీలో చేరండని,తెదేపా లో చేరండని,జనసేన పార్టీలో చేరండని పిలుపునివ్వలేదు. అలాంటి పరిస్థితిలో కొత్తరాగం అందుకొన్న ఆకుల శ్రీనివాస్ కుమార్ ఏ పార్టీ తీర్థం పుచ్చుకో నున్నారో.......

# అశోక్ గజపతిరాజు కు(“అభినందనలు “ తెలిపిన ఎమ్మెల్యే సుజనా చౌదరి



**విజయవాడ పశ్చిమ జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గోవా గవర్నర్ గా నియమితులైన టీడీపీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి వర్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు కు విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ కేంద్ర మంత్రి యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అభినందనలు తెలిపారు.ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు గోవా అభివృద్ధిలో అశోక్ గజపతిరాజు భాగస్వామి కావాలని అంకితభావం, కృషి ద్వారా విజయాలను సాధించాలని, లక్ష్యాలను చేరుకోవాలని సుజనా చౌదరి ఆకాంక్షించారు..

## జగన్మాత బెజవాడ శ్రీకనకదుర్గమ్మ సన్నిధిలో గణపతి హెూమం





**విజయవాడ పశ్చిమ జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జగన్మాతకి బెజవాడ శ్రీకనకదుర్గమ్మ వారి సన్నిధి లో సోమవారం ఉదయం వేద పండితులు గణపతి హెూమం నిర్వహించారు. పండితులు ఈ హెూమం ప్రాధాన్యత వివరించారు.మానవులను కష్టాల నుండి గట్టెక్కించేది సంకటహర చతుర్థి ?పూజ . గణపతికి అత్యంత ప్రీతిపాత్రమైన తిథులలో ప్రధానమైనది చవితి.సంకటహర చతుర్థి పూజ ఆచరించడం వలన జాతకములోని సమస్యలు తొలగి,అన్ని పనులలో సంకటములన్నీ తొలగి సఫలత చేకూరుతుందని పురాణోక్తి. ఆది పరాశక్తి, జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధిలో వేంచేసిన విఘ్నాధిపతి అయిన గణపతిని సంకట హర చతుర్థి సందర్భంగా సోమవారం ఉదయం భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజ, హెూమములను మంత్ర పూర్వకంగా అర్చక స్వాములు జరిపించారు.ఆలయకార్యనిర్వహణాధికారి వి. కె. శీనానాయక్ హెూమం, అభిషేకం పూజలలో పాల్గొన్నారు.స్థానాచార్య వి. శివ ప్రసాద్ శర్మ, వేద పండితులు, అర్చకులు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు ఆశీర్వచనం, ప్రసాద వితరణ నిర్వహించారు.

## శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలోశ్రీ చాగంటి కోటేశ్వరరావు దంపతులు





**విజయవాడ పశ్చిమ జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రముఖ ఆధ్యాత్మిక పురాణ ప్రవచనకర్త, ప్రభుత్వ సలహాదారులు (విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు) క్యాబినెట్ హెూదాలో చాగంటి కోటేశ్వరరావు దంపతులు సోమవారం ఉదయం శ్రీ అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆ దంపతులకు ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీ సీనా నాయక్ ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో శ్రీ అమ్మవారి దర్శనము ఏర్పాటు చేసి అమ్మవారి చిత్రపటం, అమ్మవారి ప్రసాదములు ఇచ్చి వేదపండితులతో ఆశీర్వచనం అందించారు.

## వెయ్యి మాటల కన్నా ఒక చిత్రం మిన్న

***హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వీ నారాయణరావు***






**విజయవాడ పశ్చిమ జూలై 14 (వార్తా ప్రభ ప్రతినిధి)**వెయ్యి మాటల్లో చెప్పలేని భావాన్ని ఒక్క చిత్రంలో చూపించవచ్చని హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. డ్రమటిక్ అసోసియేషన్, ఎన్.ఎస్.ఎస్. విభాగం, కె.ఎం.టి అకాడమి ఆఫ్ విజన్ సంయుక్త నిర్వహణలో మూడు రోజుల పాటు ‘ఫొటోగ్రఫీ’ అంశంపై నిర్వహించనున్న వర్క్ షాప్ సోమవారం కేబీఎన్ కళాశాలలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వి. నారాయణరావు మాట్లుడుతూ కళ్ళు కనిపెట్టలేని సున్నిత దృశ్యాలను కెమేరా కన్ను పసిగడుతుందన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతకు ఫొటోగ్రఫీ నైపుణ్యం తోడైతే అద్భుతమైన చిత్రాలు తీయడం సాధ్యమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ ఫొటోగ్రఫీ రంగం ప్రస్తుత సమాజంలో కేవలం కళగా మాత్రమే కాకుండా పరిశ్రమగా, ఉపాధిగా కూడా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇటువంటి వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యార్థులు చక్కటి ఉపాధి అవకాశాలు కూడా పొందవచ్చన్నారు. రిసోర్స్ పర్సన్ కె.దీనారాజు ఫొటోగ్రఫీలో ప్రాథమిక అంశాలు, మెలకువలు, నైపుణ్యాలు, డిజిటల్ కెమెరాల వినియోగం, సహజసిద్ధమైన సన్నివేశాల చిత్రీకరణలో అవలంబించాల్సిన పద్ధతులు, ఫొటోలు తీయడంలో ఉండాల్సిన శ్రద్ధ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫోటోలో కథనాన్ని ఎలా చెప్పాలి, చిత్రీకరణలో దృష్టి పెట్టాల్సిన అంశాలేమిటి, కళ్ళతో చూడటమే కాకుండా కెమెరా కంటితో చూడటం ఎలా అనే అంశాలపై విశ్లేషణాత్మకంగా వివరణ ఇచ్చారు. డ్రమటిక్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ కె.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి.పవన్ కుమార్, ఎన్.సాంబశివరావు, ఎం.శాంతిబాబు, పి.గౌతమీదేవి పాల్గొన్నారు.

# మీకోసం అర్జీలను సత్వరమే పరిష్కరించాలి..

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల నుండి అందుతున్న మీకోసం అర్జీలను అత్యంత ప్రాధాన్యతతో సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, అదనపు ఎస్ పి సత్యనారాయణ, కె ఆర్ ఆర్ సి. ఎస్.డి.సి శ్రీదేవి, మచిలీపట్నం ఆర్ డి ఓ కే స్వాతి, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజులతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ,మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ప్రజల సమస్యలను ఎంతో ఓపికగా ఆలకించి సంబంధిత అధికారులను పిలిపించి వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు.మరి ముఖ్యంగా దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో వేదికనుండి కిందికి దిగి వారి వద్దకే వచ్చి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.

**దివ్యాంగులకు న్యాయసహాయం కల్పించిన కలెక్టర్** మండల కేంద్రమైన తొట్లవల్లూరుకు చెందిన దివ్యాంగురాలు పెద్ద అమ్మాజీ చక్రాల కుర్చీలో మీకోసం సమావేశం మందిరం వద్దకు రాగా జిల్లా కలెక్టర్ ఆమె దగ్గరకు వచ్చి ఆమె సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన మేనకోడలు శివలక్ష్మి తనను మోసం చేసి 25 సెంట్లు స్థలాన్ని రాయించుకున్నారని తన గురించి ఏమాత్రం పట్టించుకోవడంలేదని తనకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కు విన్నవించగా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పరిధిలో ఉచితంగా న్యాయ సహాయం అందిస్తారని అక్కడికి వెళ్లాలని తెలియజేస్తూ సీనియర్ సివిల్ జడ్జి న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెవి రామకృష్ణయ్యను సంప్రదించారు. వారికి ఉచితంగా న్యాయ సహాయం అందించి తగిన న్యాయం చేయాలని కోరారు. పమిడిముక్కల మండలం గురజాడ గ్రామంలో సర్వే నంబర్ 124/1లో సాయిపురం గ్రామానికి గతంలో ఎడ్ల బండ్లు, రైతులు రాకపోకలకు రహదారి ఉండేదని, రైతులు తమ 200 ఎకరాల పొలాలు సాగుకు వెళ్లేవారని గ్రామ మాజీ సర్పంచ్ కుమారుడు ఎస్సీల స్మశాన భూమి అంటూ రాకపోకలకు వీలు లేకుండా సిమెంట్ స్తంభాలు పాతారని దీంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నామని తమకు న్యాయం చేయాలని సామాజిక కార్యకర్త జంపన శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో పలువురు రైతులు జిల్లా కలెక్టర్ కు అర్జీ అందజేసి విజ్ఞప్తి చేశారు. తోట్లవల్లూరు మండలం కుమ్మమూరు గ్రామానికి చెందిన బొప్పన గోపాలకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో 1500 మంది నివసిస్తున్నారని, గ్రామానికి తూర్పు వైపున డ్రైనేజీ కోడు పూర్తిగా ఆక్రమణకు గురై డ్రైనేజీ పూడుకుపోయినదని, గ్రామంలో ఉన్న మురుగునీరు అధిక వర్షాలకు ముంపుకు గురై ప్రజలకు అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, ఆర్ అండ్ బి రోడ్డు పక్కనే ఉన్నందున సుమారు 35 మంది ఆక్రమణదారులు రోడ్డును ఆక్రమించి రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ డ్రైనేజీ కోడులో ఉన్న నీటిని కలుషితం చేస్తున్నారని, కుమ్మమూరు గరికపురం సరిహద్దుల్లో ఉన్న ఈ కోడు విడగొట్టి ఆక్రమణదారులను తొలగించి న్యాయం చేయవలసినదిగా కోరుతూ అర్జీ అందజేశారు. మండల కేంద్రమైన కోడూరులో నివసిస్తున్న గోసాల నిర్మల తన పొలానికి సంబంధించిన సర్వే చేయాలని అర్జీ పెట్టుకున్నామని, సర్వే కొలతలు సరిగా వేయలేదని, సర్వే రాయి మీద ప్రహరీ గోడ కట్టి తమను చాలా ఇబ్బంది పెడుతున్నారని, సర్వేయర్ లను పంపి కొలతలు వేయించవలసిందిగా కోరుతూ అర్జీ అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఈనెల 16వ తేదీన మచిలీపట్నం నియోజకవర్గం పరిధిలో నేషనల్ కళాశాలలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా పై రూపొందించిన గోడ పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కే. కన్నమ నాయుడు, పంచాయతీరాజ్ ఎస్ ఈ రమణ రావు, రహదారులు భవనాలు ఆర్డబ్ల్యూఎస్ ఈఈ లు లోకేష్, నటరాజు డీఎం హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ట, డిపిఓ జే అరుణ, డ్వామా పిడి శివప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్ రావు, డి టి డబ్ల్యూ ఓ పని దూర్చటి, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, ఉద్యాన అధికారి జే జ్యోతి, వృద్ధులు దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడి కామరాజు, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గవర్నర్ స్థానానికే వన్నెతెచ్చే గొప్ప వ్యక్తి అశోక్ గజపతి రాజు : హాజీ గౌస్



**కనిగిరి జూలై 14 వార్తా ప్రభ ప్రతినిధి** సీనియర్ నాయకుడికి సముచిత గౌరవం దక్కేలా చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు : హాజీ గౌస్– ఎన్డీఏ ప్రభుత్వం సమర్థుడైన వ్యక్తిని సరైన స్థానానికి ఎంపిక చేయడం తెలుగుజాతికే గర్వకారణం : హాజీ గౌస్" టీడీపీ సీనియర్ నాయకులు, పొలిట్ బ్యూరోసభ్యులు, మాజీకేంద్రమంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజును గోవారాష్ట్ర గవర్నర్ గా నియమించడం మిక్కిలి ఆనందాన్నిచ్చింది. సీనియర్ నాయకుడికి సముచిత స్థానం దక్కడంలో కీలక భూమిక పోషించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ప్రత్యేక అభినందనలు తెలియచేస్తున్నాను. మోదీ నాయకత్వంలోని ఎన్డీఏప్రభుత్వం సమర్థుడైన వ్యక్తిని సరైన స్థానానికి ఎంపిక చేయడం నిజంగా తెలుగుజాతికే గర్వకారణం. స్వర్గీయ ఎన్టీఆర్ మంత్రివర్గంలో ఎక్సైజ్, వాణిజ్యశాఖ మంత్రిగా, చంద్రబాబు కేబినెట్ లో ఆర్థిక, రెవెన్యూ మంత్రిగా, మోదీ హాయాంలోనే కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా పనిచేసిన గొప్ప అనుభవజ్ఞుడు అశోక్ గజపతిరాజు . 36 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంతో పాటు, వ్యక్తిగత జీవితంలోనూ ప్రజాసేవకే ప్రాధాన్యమిచ్చిన మానవతా వాది. పూసపాటి వంశీయుల పేరుప్రతిష్ఠలు, గౌరవమర్యాదలు మరింత ఇనుమడించేలా వారి పూర్వీకులు చేపట్టిన ప్రతి కార్యాన్ని నేటికీ నిర్విరామంగా కొనసాగిస్తున్న గొప్ప వ్యక్తి. తనకున్న అనుభవం.. ప్రజాసమస్యలు, పరిపాలనపై ఉన్న అవగాహనతో అశోక్ గజపతిరాజు గవర్నర్ పదవికే వన్నె తీసుకొస్తారనడం ఎంత మాత్రం అతిశయోక్తి కాదు" పామూరు పట్టణ ముస్లిం మైనారిటీ టిడిపి నాయకులు షేక్ హాజీ గౌస్ సోమవారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు.

## ప్రజలకు ఎటువంటి సమస్య తలెత్తనివ్వకూడదు

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు




**విజయవాడ పశ్చిమ జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజలకు ఎటువంటి సమస్య తెలుస్తనివ్వకూడదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ ఎం అన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం ప్రధాన కార్యాలయంలో మరియు జోనల్ కార్యాలయాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడైతే ఎటువంటి సమస్య తలెత్తనివ్వకుండా అధికారులు అప్రమత్తంగా ఉండు చూసుకోవాలని అన్నారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి ఎవరు ఫిర్యాదు చేశారు వారి దగ్గరికి వెళ్లి సమస్యను అర్థం చేసుకొని ఆ సమస్యకు అర్థవంతమైన పరిష్కారాన్ని చూపించి శాశ్వతంగా సమస్య తలెత్తకుండా ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 17 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 3, ఇంజనీరింగ్ 6, రెవిన్యూ 4, వైద్య %డ% ఆరోగ్యం 3, పి ఓ యుసిడి 1 మొత్తం కలిపి 17 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానెట్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె అర్జున్ రావు, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సృజన, జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత, పర్యవేక్షణ ఇంజనీర్ పి సత్యకుమారి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 16న మచిలీపట్నంలో మెగా జాబ్ మేళా.

- యువత సద్వినియోగం చేసుకోవాలి.
- కలెక్టర్ అండ్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ డి.కె. బాలాజీ.



**మచిలీపట్నం జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను ది.16.07.2025 బుధవారం నాడు ఉదయం 09:00 గంటలకు మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాల లో "మెగా జాబ్ మేళా" నిర్వహించనున్నట్లు కలెక్టర్ అండ్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ డి.కె. బాలాజీ తెలిపారు.ఈ జాబ్ మేళాలో, ఎప్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, డైకిన్ ఎయిర్ కండీషనింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్ ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, దెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎమ్ఆర్ఎఫ్ లిమిటెడ్, గోదావరి కృష్ణ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, హెచ్డిబి ఫైనాన్సియల్ సర్వీసెస్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, జోయాలుక్కాస్ జ్యువెలరీ, జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా క్యాపిటల్, టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్నోవ్సోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మెడ్ప్లస్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, బజాజ్ ఫిన్సర్వ్, రిలయన్స్ డిజిటల్ వంటి సుమారు 30 ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని ఉపాధి అధికారి/డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ తెలిపారు.ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, బి.ఫార్మసి, పీజి పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు యువత అర్హులని, ఎంపిక అయిన వారికి మంచి వేతనము మరియు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కలవని, జులై 16న నిర్వహించబోయే మెగా జాబ్ మేళాకు హాజరయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా సదరు ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు ఆసక్తి మరియు తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in/user-registration లింక్ నందు తప్పనిసరిగా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ కావడంతోపాటు, సదరు మెగా జాబ్ మేళాకు రెజ్యూమె లతో లేదా బయోడేటా ఫోరమ్ లతో పాటు ఆధార్, ఆధార్ కు లింక్ అయిన ఫోన్ నంబర్, పాన్ కార్డ్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 96666 54641, 96767 08041, 99895 19495, 99664 89796 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## ఎన్డీఏ కార్యాలయంలో ఎల్.ఓ.సీ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్



**విజయవాడ పశ్చిమ జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన ఎల్.ఓ.సి (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాలను సోమవారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. 37వ డివిజన్ వన్ టౌన్ కు చెందిన కే లలిత దేవి ( 55) బ్రెస్ట్ ట్యూమర్ తో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది ఆవిడకు మరింత మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలుపగా ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం కోసం దరఖాస్తు చేసుకున్నారు.వారికి రూ 2 లక్షల 25 వేల ఎల్.ఓ.సీ ను ఎన్డీఏ కూటమినేతల తో కలిసి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ బాధితురాలి కుటుంబ సభ్యులకు అందించారు . అదేవిధంగా 56 వ డివిజన్ పాత రాజరాజేశ్వరి పేటకు కు చెందిన దొన్నపాటి రామక్క గాల్ స్టోన్ సమస్యతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం దరఖాస్తు చేసుకోగా రూ 1 లక్ష 8 వేల ఎల్. ఓ.సీ ను అందజేశారు.త్వరితగతిన ఎల్.ఓ.సి మంజూరు చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధితుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరు మధుసూదన రావు,ఎన్డీఏ కూటమి నేతలు పోలిశెట్టి శివ, నున్న కృష్ణ, నాళం ఠాకూర్, రేగళ్ల లక్ష్మణరావు, పచ్చి పులుసు వెంకట శివప్రసాద్, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు సప్పా శ్రీనివాస్, కొల్లి దుర్గారావు, టీ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## బీసీ గౌడ కులస్తురాలు పై దాడి దుర్మార్గమైన చర్య

### ఉప్పల హారిక దంపతులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

### కైకలూరు నియోజకవర్గ వైసిపి మహిళా నాయకులు.



**కైకలూరు జులై 14 (వార్తా ప్రభ)** ఏలూరు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ,కైకలూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఉమ్మడి కృష్ణా జిల్లా జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక దంపతులపై శనివారం గుడివాడలో జరిగిన దాడిని ఖండిస్తూ, కైకలూరు నియోజకవర్గ మహిళా నాయకులు కైకలూరు ఏలూరు రోడ్ లోని డిఎన్ఆర్ కార్యాలయంలో పత్రికా సమావేశాన్ని నిర్వహించారు.ఉమ్మడి కృష్ణా జిల్లా జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక దంపతులు గుడివాడలో జరుగుతున్న జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి వారి వాహనంలో వెళుతూ ఉండగా,కొంతమంది కూటమి నాయకులు కార్యకర్తలు వీధి రౌడీలా వ్యవహరిస్తూ హారిక వాహనాన్ని నిలుపుదల చేసి మారణాయుధాలతో దాడి చేయడం హేయమైన చర్య అని, హారిక గారి దంపతులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కైకలూరు నియోజకవర్గ వైసీపీ మహిళా విభాగం నాయకులు తెలిపారు. జిల్లా ప్రథమ పౌరురాలు బి.సి వర్గానికి చెందిన గౌడ కులస్తురాలు విద్యాధికురాలు అయినటువంటి జడ్పీ చైర్ పర్సన్ పైనే ఇంత దారుణంగా ప్రవర్తిస్తే ఇక సామాన్య మహిళల పరిస్థితి ఏంటి అని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈ దుర్మార్గమైన చర్యను సాటి మహిళలుగా మేము తీవ్రంగా ఖండిస్తున్నామని నియోజకవర్గ మహిళా నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శిలు కూసంపూడి కనకదుర్గ రాణి(బుజ్జమ్మ),గంటా సంధ్య,నియోజకవర్గ మహిళా విభాగ అధ్యక్షురాలు దున్న బేబీ, ముదినేపల్లి మండల జడ్పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, ముదినేపల్లి మండల వైస్ ఎంపీపీ రాచూరి రాధా,అర్జ విజయ దుర్గ,ఆటపాక ఎంపీటీసీ సభ్యులు తమ్మిశెట్టి లక్ష్మీ,బాలమ్మ,మద్దా రాణి,ఆరేపల్లి శివ నాగలక్ష్మి,తేరా జ్ఞానావతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ నరసింహారావు.



**కైకలూరు జూన్ 14 (వార్తా ప్రభ)** ఏలూరు జిల్లా కైకలూరు పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో 112,113,119 బూత్ లలో నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కే.కే.బాబు, రాష్ట్ర తెలుగుదేశం నాయకులు వీరభత్తిన సుధ, సదర్ల సూరి, బూత్ ఇంచార్జ్ డి. రామస్వామి తదితరులు పాల్గొన్నారు. పెరిగిన పెన్షన్ డబ్బులు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి కార్యక్రమాలతో అన్నిచోట్ల పండగ వాతావరణం నెలకొని ఉంది. అని టిడిపి నాయకులు అన్నారు.

## పి.ఎం. కౌశల్ వికాస్ పథకంపై అవగాహన ర్యాలీ



**విజయవాడ పశ్చిమ, జూన్ 14:(వార్తా ప్రభ ప్రతినిధి)**కె.బి.ఎన్. కళాశాల ఎన్.సి.సి, కంప్యూటర్ విభాగాల సంయుక్త నిర్వహణలో సోమవారం 'ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం, కౌశల్ వికాస్ రోజ్ గార్ యోజన' పథకంపై కేబీఎన్ కళాశాల ఎన్సిసి విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ యువతలో నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ లక్షణాల పెంపు తదితర అంశాల గురించి భారత ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని, యువతరం వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ర్యాలీ ద్వారా తోటివారికి కూడా ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. 17వ ఆంధ్ర బెటాలియన్ ట్రైనింగ్ జెసిఒ సుబేదార్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జి.సి.పాండే నేతృత్వంలో యువతరం కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, కంప్యూటర్ విభాగాధిపతి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నారాయణస్వామి ఆరాధన మహోత్సవాలకు దారపనేని సౌజన్యంతో వడ్లమూడి 1 లక్ష ,01, 116 రూపాయలు విరాళం



**కనిగిరి జూలై 14 వార్తా ప్రభ ప్రతినిధి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం సిఎస్ పురం మండలంలో ప్రసిద్ధి చెందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో జరుగుతున్న ఈ నెల 17 న గురువారం జరుగుతున్న ఆరాధన కార్యక్రమంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ సౌజన్యంతో %వీ/రా% వడ్లమూడి నాగేశ్వరరావు, అండ్ సన్స్ వడ్లమూడి నాగేంద్రబాబు, లక్ష్మి శిరీష దంపతుల విద్యుత్ అలంకరణ , వడ్లమూడి నాగార్జున ఆర్థిక సహాయంతో పుష్పాలంకరణకు ఆరాధన మహోత్సవంలో విచ్చేయుచున్న భక్తులకు 1,01116 రూపాయలతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ ,అంతేకాకుండా ఆలయంలో సొంత నిధులతో గర్భగుడిలో పుష్పాలంకరణ అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి గిరిరాజు నరసింహారావు దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ , కొమ్మినేని వెంకటరావు,కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ కు, వడ్లమూడి నాగేంద్రరావు కు, రెడ్డి గారి కొత్తపల్లె మాజీ సర్పంచ్ చావా సుబ్బయ్యకు ఘనంగా స్వామివారి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

## ఆర్యవైశ్య విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ.



**మచిలీపట్నం జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సోమవారం స్థానిక గీతా మందిరంలో మచిలీపట్నం ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థినీ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులు గా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు మామిడి దుష్యం కుమార్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు సన్నిధి నాగసాయి శ్రీనివాస్ విచ్చేసినారు. గీతా మందిరం ప్రార్థన సంఘం అధ్యక్షులు వంకాయల రామకృష్ణ, మామిడి వేణుగోపాలరావు, కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి వేముల వేముల శ్రీనివాస్మరియు కృష్ణాజిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు శ్రీ వెచ్చా మల్లికార్జున్ గుప్తా,జిల్లా ఆర్యవైశ్య యువజన సమాఖ్య అధ్యక్షులు,శ్రీ వేముల కృష్ణ, మానేపల్లి చిన్న, పద్మనాభుని ప్రార్థన శేఖర్ , కంటేటి శ్రీధర్, సోమిశెట్టి బాలాజీ, అద్దేపల్లి రాధాకృష్ణ మనోహర్, ఉడత్తు దత్త, గుండా సాయి చరణ్, ఉడత్తు సాయి కిరణ్, తమ్మన మారుతి కిరణ్, జల్లూరు మణికంఠ, రాణా ప్రతాప్, విడియాల బాలాజీ, విష్ణువర్ధన్, సామా పవన్ కుమార్ గా, కొండూరు మెహర్ సాయి, టీ గుప్తా, జి ఎస్ ఎస్ కేదార్, జిల్లా ఆర్యవైశ్య యువజన విభాగం చీఫ్ ఆర్గనైజర్ పులవర్తి నటరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య యువజన సంఘం ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి శివ ప్రసాద్ విజయవంతంగా నిర్వహించినారు.

# ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాల గోడ పత్రికను ఆవిష్కరణ




**ఇబ్రహీంపట్నం జులై 14(వార్తా ప్రభ ప్రతినిధి):**ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఆగస్టు 9, 10 తేదీలలో కొండపల్లి మున్సిపాలిటీలో క్రాంతి హైస్కూల్ లో రెండు రోజులపాటు జరగానున్నాయి. ప్లీనరీ సంబంధించిన గోడ పత్రికను క్రాంతి హైస్కూల్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్న నేటికీ సంక్షేమ హాస్టల్ లో, విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదని, జిల్లా లో అనేక సమస్యలతో విద్యార్థుల సతమతం అవుతున్నారని అన్నారు. ఆఫ్లైన్లోనే డిగ్రీ అడ్మిషన్స్ జరపాలని, డిగ్రీలో డబుల్ విధాన్ని తీసుకొస్తామని చెప్పు మరల లేదు సింగల్ మేజర్ విధాన్ని కొనసాగిస్తామని ప్రభుత్వం ద్వంద వైఖరితో విద్యార్థులను అయోమయానికి గురవుతున్నారని వాపోయారు. డిగ్రీలో డబుల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని వారు ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు నారా లోకేష్ గారు జీవో నెంబర్ 77ను రద్దుచేసి పీజీ విద్యార్థులకు పూర్తి ఫీజు రియంబర్స్ ఇస్తామని చెప్పి హామీ ఇచ్చారని నేటి వరకు హామీ అమలు చేయకపోవడం దారుణమని అన్నారు వెంటనే జీవో నెంబర్ 77 రద్దు చేయాలని పెండింగ్లో ఉన్న పూర్తి ఫీజు రియంబర్స్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న విద్యార్థుల సమస్యలను ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ తీసుకోనునామాని తెలిపారు. కావున విద్యార్థులు, విద్యావంతులు ఆగస్టు 9, 10 తేదీల్లో కొండపల్లిలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశంలను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఎం.మహేష్, జెవివి జిల్లా అధ్యక్షులు మురళీమోహన్ గారు ఎస్ఎఫ్ఐ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కుశాల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 2 వ రోజుకు చేరిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె




**ఇబ్రహీంపట్నం, జులై 14(వార్తా ప్రభ ప్రతినిధి):**మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం 26 వేలు అమలు చేయాలని, సమ్మె నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె రెండో రోజు చేరింది మున్సిపల్ కార్మికుల సమ్మె –జీతాల పెంపు, కనీస వేతనం 26 వేలు అమలు, సంక్షేమ పథకాల అమలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, రిటైర్మెంట్ వయసు 62 సం" పెంపుకై , హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్ కై జరిగే ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తున్నాము. వాటర్ సప్లై అగిన, పట్టణంలో వీధి లైట్లు వెలగకపోయిన, వాటర్ పైప్ లైన్లు రిపేర్లు ఉన్న ప్రజల ఇబ్బందులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన జీతాల పెంపు ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ మేస్త్రి యం వాసు, వి శ్రీను, కరెంట్ శ్రీను, నోజు , డోమినిక్ రాజు, అప్పలరాజు, సుబ్బారావు, జోజి , విజయ్ కుమార్, దుర్గారావు, శివరామకృష్ణ, తిరుపతి రావు, రాజేష్ , క్రాంతి, లక్ష్మీ నారాయణ, లక్ష్మణ్, రమ , ఆర్ శ్రీను, హానుమంత్ , వెంకయ్య, ప్రకాష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# కొండపల్లిలో కబడ్డి అకాడమీ ప్రారంభం



**ఇబ్రహీంపట్నం,జూలై14 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి నాలుగు వంతెనలసెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన కబడ్డీ అకాడమీని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గ ఇన్ చార్జి అక్కల రామమోహన రావు (గాంధీ) ఆదివారం ప్రారంభించారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా అకాడమీని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు యర్రంశెట్టి నాని, భాను ప్రకాష్, కబడ్డీ కోచ్ లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# క్రోచెట్ లేస్ ప్రాడక్ట్స్" కు వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ అవార్డ్ అందుకున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం, జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కేంద్ర ప్రభుత్వ వాణిజ్య పన్నులు, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సోమవారం న్యూఢిల్లీ ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో ఏర్పాటుచేసిన ఓడిఓపి అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి "నరసపూర్ క్రోచెట్ లేస్ ప్రొడక్ట్స్" కు కేంద్ర వాణిజ్య పన్నులు, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ చేతులు మీదుగా అవార్డును అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 9 ఉత్పత్తుల్లో పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురం క్రోచెట్ లేస్ ప్రొడక్ట్స్ కు ఓడిఓపి అవార్డు లభించింది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 8 జౌళి చేతి ఉత్పత్తుల్లో నరసాపురం లేసు కు భౌగోళిక సూచిక గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ నర్సాపూర్ లెస్ అల్లికలకు గత సంవత్సరం జిఐ గుర్తింపు రావడం, నేడు వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కింద అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ గుర్తింపులతో వేలాదిమంది నేత కార్మికులు, కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వగలుగుతామన్నారు. ప్రత్యేక ఉత్పత్తుల ప్రోత్సాహం, మార్కెట్ లింకేజి, బ్రాండింగ్ ప్రమోషన్ లక్ష్యంగా ఇప్పటికే పని చేస్తున్నట్లు తెలిపారు. భారతీయ టెక్స్టైల్ పరిశ్రమలో చేతితో నేసిన, చేతితో తయారు చేసిన వస్త్రాలు దేశంలో భౌగోళిక సూచిక నమోదిత ఉత్పత్తుల పట్టికలో అగ్రగామిగా ఉన్నాయని తెలిపారు. దేశంలో జిఐ ట్యాగ్ చేయబడిన హ్యాండ్లూమ్స్, హస్తకళా ఉత్పత్తులు విశేషంగా ఆకట్టుకుంటాయన్నారు. అంతర్జాతీయ గుర్తింపుతో పాటు, రాష్ట్రంలో జిఐ గుర్తింపు పొందిన ఉత్పత్తుల్లో ఒకటిగా మన లేసు ఉత్పత్తులు నిలవడానికి కారణమైన తయారీదారుల కృషి ఫలితంగా నేడు మరో అవార్డును ఓడిఓపి క్రింద పొందగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, జౌళి, వస్త్ర పరిశ్రమల శాఖామంత్రి ఎస్.సవిత, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు నిలయంగా మారిన గుంతలను పూడ్చిన ఎస్ఐ

***- దంతాలపల్లి ఎస్సై పిల్లల రాజు,***

***- ఎస్సై పనితీరును అభినందించిన మండల ప్రజలు***



**దంతాలపల్లి జూలై 14(వార్తా ప్రభ)** దంతాలపల్లిమండల కేంద్రం నుండి వేములపల్లి గ్రామం వరకు సూర్యాపేట ప్రధాన రహదారిపై ప్రమాదాలకు నిలయంగా ఉన్న గుంతల వల్ల వాహనదారులు ప్రయాణంలో ఇబ్బంది పడుతు,పలు ప్రమాదాలకు గురవుతున్నారు, ప్రయాణంలో ఇబ్బంది పడుతున్నారు ఇట్టి విషయంపై స్పందించిన దంతాలపల్లి ఎస్సై పిల్లల రాజు సొంత ఖర్చుతో సిమెంట్ కాంక్రీట్ తో సోమవారం గుంతలను పూడ్చి, వాహనాలు ప్రమాదాలకు గురి కాకుండా ఉండుటకు కృషి చేశారు.,ఈ విషయాన్ని చూసిన పలువురు, మండల ప్రజలు ప్రముఖులు ఎస్సై రాజు పనితీరును అభినందించారు, పాడైపోతున్న రోడ్ల వలన వాహనదారులు అనేక ప్రమాదాలకు గురి అవుతున్నారని ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండుట కొరకు మా వంతు సహాయం చేశామని ఎస్ఐ తెలియజేశారు, ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, జన్నయ్య , నరసయ్య,గణేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# బీసీలు రాజ్యాధికారం సాధించుకోవాలి.

## బీసీ నేత తోట కోటేశ్వరరావు పిలుపు

***రాజ్యాధికార సాధన సందేశాత్మక గేయకావ్యం "బహుజన గణ మన "గ్రంథ ఆవిష్కరణ ఆవిష్కరణ***



**గుంటూరు, జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** : బీసీ, ఎస్.సి., ఎస్.టీ., మైనారిటీ సంఘాల ఆధ్వర్యంలో గుంటూరు లో జరిగింది. ప్రముఖ కవి జూలూరు గౌరీశంకర్ రచించిన ఈ గేయ కావ్య గ్రంధాన్ని తొలత మున్సిపల్ అతిధి గృహం వద్ద గల మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం వద్ద ఆవిష్కరణ జరిగింది. అనంతరం కాన్షిరాం విగ్రహం వద్ద, లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద, మరియు అమరావతి రోడ్ లోని కర్పూరి ఠాగూర్, బీపీ మండల్ విగ్రహాల వద్ద గ్రంథ ఆవిష్కరణ చేశారు. చివరిగా కోరిటెపాడు పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద గల వీరనారి చిట్యాల ఐలమ్మ విగ్రహం వద్ద ఆవిష్కరణ జరిగింది.ఆవిష్కరణల సందర్భంగా బహుజన గణ మన గ్రంధం లో రచయిత జూలురు గౌరీశంకర్ ప్రవశించన కొన్ని సూక్తులను ముఖ్య కావ్య బాణాలను పాల్గొన్న ప్రముఖులు చదివి వినిపించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీలకు చట్టసభలో రిజర్వేషన్లు కల్పించాలని, బీసీలు రాజ్యాధికార లక్ష్యంతో ముందుకు సాగాలని బీసీ నేత తోట కోటేశ్వరరావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో బహుజన నాయకులు ఉగ్గం సాంబశివరావు, పీవీ రమణయ్య, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు భగతసింగ్, వరగాని ఏడుకొండలు, జయసుధ, జూపూడి శ్రీనివాసరావు, నల్లపు నీలంబరం, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, సి హెచ్ వాసు, సాధం సత్యానారాయణ, బత్తుల వీరాస్వామి, దుర్గారావు,జి. వీరయ్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భారత ఆహార సంస్థ ఆధ్వర్యంలో 8వ ఇంటర్-రీజినల్ సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్

**విజయవాడ, జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భారత ఆహార సంస్థ (ఎఫ్ సి ఐ) ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ విభాగం 8వ ఇంటర్-రీజినల్ క్రికెట్ టోర్నమెంట్ (సౌత్ జోన్)ను విజయవాడ నున్న లోని గ్రీన్ హిల్స్ అరీనాలో జూలై 15 -16 తేదీలలో నిర్వహించనుంది.రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్లో, "ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు దక్షిణాది రాష్ట్రాలతో పాటు జోనల్ కార్యాలయ జట్టు కూడా పాల్గొంటాయి. క్రీడా స్ఫూర్తికి ఆదర్శంగా టోర్నమెంట్ నిలుస్తుందని ఎఫ్ సి ఐ తెలిపింది.

# వేధింపులు ఆపండి......!

## ఆర్టీసీ ఎండి కి కండక్టర్లు వినతి




**విజయవాడ/జి.కొండూరు : జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తమ ప్రతిష్ట దెబ్బతినేలా ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు గత కొన్ని రోజులుగా వేధింపులకు గురిచేస్తున్నారని కాకినాడ జిల్లా, కాకినాడ ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్లు తమ ఆవేదన వ్యక్తంచేశారు. విజయవాడలోని ఆర్టీసీ భవన్లో మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకాతిరుమలరావును సోమవారం కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. కాకినాడ డిపో లో ఒక అధికారి మహిళా కండక్టర్ల ను వేధింపులకు గురిచేస్తున్నట్లుగా ఆకాశ రామన్న పేరుతో ఓ ఉత్తరం వచ్చిందనే పేరుతో విజయనగరం విజిలెన్స్ ఎస్ఐ విచారణకు ఈనెల 8, 9 తేదీల్లో వచ్చారని,ఆమె తమతోపాటు మరికొందరితో మాట్లాడి వాంగ్మూలాన్ని తీసుకున్నారనీ, చాలా అసభ్యపదజాలంతో మాట్లాడటమే కాకుండా బెదిరింపులకు సైతం దిగారని కండక్టర్లు వాపోయారు. తన వద్ద మీ ఫొటోలు సైతం ఉన్నాయని చెబుతూ నానా దుర్భాషలాడారని తెలిపారు. తాము విచారణకు సహకరిస్తున్నా కించపర్చే విధంగా మాట్లాడుతు న్నారని తెలిపారు.రహస్య విచారణ అని చెప్పి డిపోలో బహిరంగంగా అందరిముందూ ఇష్టానుసారంగా మాట్లాడారని వాపోయారు. తాము ఆర్టీసీ ఉద్యోగంలో చేరిన నాటి నుంచి నేటి వరకూ గౌరవప్రదంగా విధులు నిర్వహిస్తున్నామనీ, తాజాగా విజిలెన్స్ ఎస్ఐ దుందుడుకు చర్యలతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని తెలిపారు.ఇలాంటి చర్యలతో తమ కుటుంబాలు ఇబ్బందులు పడతాయని పేర్కొన్నారు. దీనికి ఎండి స్పందిస్తూ త్వరలోనే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు కండక్టర్లు తెలిపారు.

# ఉప్పాల హారిక ను పరామర్శించిన మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ పేర్ని కిట్టు



**పెడన జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పెడన మండలం కూడూరు గ్రామంలో కృష్ణాజిల్లా జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక మీద ఇటీవల జరిగిన దాడి గురించి అడిగి తెలుసుకుని ఖండిస్తూ సోమవారం చైర్ పర్సన్ ను పరామర్శించిన రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ పేర్ని కిట్టు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటన జరిగి మూడు రోజులు గడిస్తున్న కుడా జిల్లా ప్రథమ పౌరురాలుకె ఇలా జరిగిందంటే సామాన్య మహిళలకు ఈ కూటమి ప్రభుత్వంలో ఇంకా ఎటువంటి న్యాయం జరుగుతుంది...ఈ కార్యక్రమంలో పెడన నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీపీ రాజులపాటి వాణి జన్ను నాగమల్లేశ్వరావు యర్రంశెట్టి మహాలక్ష్మయ్యమున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజా బళ్ళ గంగయ్య బందారు మల్లి ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు....

# విత్తనాలు షాపులో తనిఖీ లు

## మైలవరం, జి.కొండూరు షాపుల్లో తనిఖీలు నిర్వహించిన విజిలెన్స్ డిఎస్పి వెంకటేశ్వరరావు



**మైలవరం/జి.కొండూరు : జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్టీఆర్ జిల్లా, మైలవరం, జి.కొండూరు,ఇబ్రహీంపట్నం మండల కేంద్రాలలోని ఎరువులు, పురుగు మందుల షాపుల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ సంయుక్తాధ్వర్యంలో అధికారులు సోమవారం ఎరువులు,పురుగుమందు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. రైతులకు క్వాలిటీ ఇన్పుట్స్ అందించే కార్యక్రమంలో భాగంగా కమీషనర్ అండ్ డైరెక్టర్ అగ్రికల్చర్ ఆదేశాల మేరకు స్టేట్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డిఎస్పి ఎస్ వెంకటేశ్వరరావు (ఏలూరు జిల్లా), సహాయ వ్యవసాయ సంచాలకు లు వి.హనుమంతరావు(పల్నాడు జిల్లా, క్రోసూరు మండలం) వారు స్థానిక వ్యవసాయ అధికారుల తో కలిసి తనిఖీలు నిర్వహించారు.ముందుగా మైలవరంలోని శ్రీ బాలాజీ సీడ్స్ అండ్ ఫెర్టిసైడ్ షాపు లో తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ ఇంక్లూజన్ లేని కారణంగా రూ. 8 లక్షలకు పైగా స్టాఫ్ సేల్స్ చూపించారు. అలాగే జి.కొండూరు మండల కేంద్రంలోని ధీరజ్ కృష్ణ ఎంటర్ప్రైజెస్, మన గ్రోమోర్ (కోరమండల్) లలో తనిఖీలు నిర్వహించారు. మన గ్రోమోర్ లో కేడి సిహెచ్ హెచ్- 9632 రకం పత్తి విత్తనాలు 25 ప్యాకెట్లు,ఆర్ఏ సిహెచ్ హెచ్ రకం పత్తి విత్తనాలు 25 ప్యాకెట్లకు సంబంధించి ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేని కారణంగా రూ. 45,050 ల స్టాఫ్ సేల్స్ విధించారు.ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని రాజ్యలక్ష్మి ఫెర్టిలైజర్స్ షాపు ను తనిఖీ చేసిన అధికారులు బృందం రూ. 85 వేల స్టాఫ్ సేల్స్ చూపించారు.విత్తనాలు పురుగు మందుల షాపు యజమానులు అనుమతులు, సర్టిఫై చేయని విత్తనాలు అమ్ముతూ రైతులను మోసం చేస్తున్నారని అధికారులు గుర్తించారు. బయట నుంచి వచ్చిన అధికారుల తనిఖీల్లో విత్తనాల షాపుల యజమానుల నిర్లక్ష్య వైఖరి బయటపడు తోంది.ఇలా ఏడాదికి రెండు మూడు సార్లు అధికారుల బృందాలు తనిఖీలు నిర్వహించడం వల్ల తమకు క్వాలిటీ ఇన్పుట్స్ అందించే అవకాశం ఉంటుందని రైతులు వాపోతున్నారు.ఎం ఆర్ పి ధరలకు మించి అమ్మకూడదని, స్టాక్ రిజిస్టర్లు అప్డేట్ చేసుకోవాలని, షాపుల లో ధరల పట్టికలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని షాపుల యజమానులకు అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయా మండలాల వ్యవసాయ అధికారులు కె. సంధ్యారాణి, కె. సిహెచ్. సూరిబాబు,రజని, లైసెన్ అధికారి వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు జన్మదిన వేడుకలు

**గంగరాజును శాలువతో సత్కరించిన ఆకుల శ్రీనివాస్ కుమార్**






**విజయవాడ పశ్చిమ, జులై 14: (వార్తా ప్రభ ప్రతినిధి)**మాజీ పార్లమెంట్ సభ్యులు, ఆక్వా డెవిల్స్ లైఫ్ ఛైర్మన్ గోకరాజు గంగరాజు 82వ జన్మదిన వేడుకలు సోమవారం కృష్ణా నది ప్రాంతంలోని ఆక్వా డెవిల్స్ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆక్వా డెవిల్స్ సభ్యులు, ప్రముఖ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ గోకరాజు గంగరాజు గొప్ప దైవ భక్తులని, సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి ఆయన, ఆయన కుటుంబ సభ్యులు కోట్లాది రూపాయల విరాళాలు ఇస్తున్నారని కొనియాడారు. విజయవాడ నగర అభివృద్ధికి గంగరాజు ఎంతో సాయం చేశారని ప్రశంసించారు.ఆయన సేవాభావంతో ఈ కృష్ణా నది తీరాన్ని తీర్చిదిద్దారని, ఎంతోమంది ఇక్కడ రకరకాల క్రీడల్లో పాల్గొంటూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారని అన్నారు. గోకరాజు గంగరాజు కలకాలం ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకుల శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆక్వా డెవిల్స్ అధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ, కార్యదర్శి యార్లగడ్డ వెంకట రమేష్ కుమార్ , ఇంకా పలువురు ప్రముఖులు పాల్గొని గంగరాజును ఘనంగా సత్కరించారు.

# అటవీ ప్రాంతంలో విత్తనాలు చల్లిన రామవరం పాఠశాల విద్యార్థులు



**భద్రాద్రి కొత్తగూడెం జూలై 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చుచుపల్లి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మార్గదర్శనంలో, ప్రకృతి పరిరక్షణకు భాగస్వాములుగా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో, ఇటీవల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విత్తనాల సేకరణ పై ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆచరణాత్మకంగా తీసుకుంటూ రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సేకరించిన విత్తనాలను సోమవారం గరీబ్ పేట్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో చల్లారు విద్యార్థులు స్థానికంగా సేకరించిన టేకు, చింత, గానుగ, వేప మరియు పనస విత్త నాలను ప్రత్యేకంగా ఎంపిక చేసి వాటిని అటవీ ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా పునరావసం చేయాలని దృష్టితో చల్లారు. వర్షాకాలాన్ని అనుకూలంగా భావించి, విత్తనాల అభివృద్ధికి సహాయకంగా ఉండే ప్రదేశాలను అటవీ శాఖ సహకారంతో గుర్తించి అక్కడ చల్లడం జరిగిందని రామవరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభుదయాల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్ బాబు, శంకర్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉప్పల హారిక దంపతులను పరామర్శించిన ముదినేపల్లి వైసీపీ నాయకులు



**ముదినేపల్లి జూలై 14 (వార్తా ప్రభ)** కృష్ణా జిల్లా పరిషత్ జెడ్పీ చైర్పర్సన్ ఉప్పాల హారిక పై దాడిని తీవ్రంగా ఖండిస్తు,రాష్ట్రంలో జెడ్పీ చైర్పర్సన్కే రక్షణ లేకపోతే,ఇక సామాన్య మహిళలల పరిస్థితి ఏంటి? తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ,ఈ ఉదయం వారి స్వగృహానికి చేరుకుని ఉప్పల హారిక రాము ను ముదినేపల్లి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ కలిసి పరామర్శించారు.

# దళిత జర్నలిస్టుల ఐక్య వేదిక నూతన కమిటీ ఎన్నిక



**తొర్రూరు జులై 14 (వార్తా ప్రభ)**మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటుచేసిన దళిత జర్నలిస్టు ఐక్యవేదిక సమావేశానికి ముఖ్యఅతిథిగా గౌరవ అధ్యక్షులు పస్తం సైదులు ఆధ్వర్యంలో 13 మందితో దళిత జర్నలిస్టుల నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది అనంతరం గౌరవ అధ్యక్షుడు సైదులు మాట్లాడుతూ మాదిగ జర్నలిస్టులు ఐక్యంగా ఉండాలని దళిత జర్నలిస్టుల సమస్యలపై అనునిత్యం పోరాడుతూ దళిత జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తూ, పరిష్కారం కానీ దళిత జర్నలిస్టుల సమస్యల కొరకు పోరాటాలు నిర్వహించాలని రానున్న రోజుల్లో దళిత జర్నలిస్టులు లకు అక్రిడేషన్ కమిటీలో అక్రిడేషన్ మరియు డబల్ బెడ్రూంల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దళిత జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని వారు తెలిపారు. అనంతరం నూతన మండల కమిటీని ప్రకటించారు మండల అధ్యక్షులుగా వేర్పుల మహేష్, ప్రధాన కార్యదర్శిగా బందు మహేందర్, కోశాధికారిగా పస్తం సాంబ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బంద్ శ్రీధర్, వెల్తురు పూర్ణచందర్, జిలకర రాజు, పంతం సురేందర్, రాయిశెట్టి ఉపేందర్, రామ్మూర్తి , చెడిపోక పోల్ రాజు , మంగళపల్లి నాగరాజు , వేలుగొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ఆధిపత్యధోరణి సాగిస్తున్న సామ్రాజ్యవాదం






**రాజాం,జూలై 14 (వార్తాప్రభ) :** ఇజ్రాయిల్ – పాలస్తీనా, రష్యా – ఉక్రెయిన్ ల మధ్య దాదాపుగా మూడేళ్లుగా సాగుతున్న మారణహోమంలో అమెరికన్ సామ్రాజ్యవాద దేశాల కుట్రలు ఉన్నాయని , యుద్ధాల నివారణలో ఐక్యరాజ్యసమితి మౌనంగా ఉందని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) రాష్ట్ర అధ్యక్షులు కాగితాల రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇస్కఫ్ రాష్ట్ర సమితి సమావేశం సోమవారం నాడు స్థానిక హనుమంతరాయ గ్రంథాలయ భవనం నందు నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ 80 ఏళ్ళ క్రితం 1945 లో హిరోషిమా నాగసాకి పట్టణాల మీద అణు బాంబులు వేసిన దుర్ఘటనలో లక్షలాది మంది మరణించారని, అలాంటి ఘోరమైన యుద్ధం నేడు గాజా పట్టణంలో ఇజ్రాయిల్ మారణకాండ సాగిస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో కాశ్మీర్ లో 25 మంది పర్యాటకుల్ని చంపిన టెర్రరిస్టుల్ని పట్టుకుని శిక్షించడంలో పాలక మోడీ ప్రభుత్వం విఫలం అయ్యారని అన్నారు. ప్రపంచ యుద్ధాల నివారణ,పర్యావరణ పరిరక్షణ, వివిధ దేశాల మధ్య శాంతి స్నేహ సాంస్కృతిక సంబంధాలు కోసం ఇస్కఫ్ ప్రపంచ వ్యాపితంగా కృషి చేస్తుందని వివరించారు. ప్రధాన కార్యదర్శి ఎస్ నరసింహులు, టి శ్రీహరిరావు మాట్లాడుతూ రాబోయే ఆగస్టు 6,9 హిరోషిమా డే సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు, సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది చివరలో సంఘం జాతీయ మహాసభలు జరుగనున్నాయని అన్నారు. సమావేశంలో బొల్లిముంత కృష్ణ, సత్యాంజనేయులు, మల్లా మాధవరావు, ఆర్ పిచ్చయ్య, మోతుకూరి అరుణకుమార్, బుద్ధవరపు వెంకట్రావు, పరుచూరి అజయ్ కుమార్, జెవి ప్రభాకర్, ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్, మహబూబ్ ఆజం తదితరులు పాల్గొన్నారు.

## ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ వారి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన..



**గుడివాడ,జూలై 14 (వార్తాప్రభ) :** కామినేని హాస్పిటల్, హెచ్.సి.జి క్యాన్సర్ హాస్పిటల్ & లైన్స్ కంటి ఆసుపత్రుల సంయుక్త సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని బొమ్ములూరు గ్రామంలో గుత్తా శివరామకృష్ణ (చంటి) ఇంటి వద్ద ఏర్పాటు చేయడమైనది. ఈ మెగా వైద్య శిబిరాన్ని 204 డిస్టిక్ గవర్నర్ సనకా సుబ్బారావు మరియు ఎం. ఆర్. ప్రసాద్ లతో కన్ను మరియు ఈసీజీ విభాగాన్ని ప్రారంభించారు. ఈ మెడికల్ క్యాంపు నందు 120 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో 20మందికి శుక్లాల ఆపరేషన్ చేయాలని నిర్ధారణ చేసి 36మందికి కళ్ళజోళ్ళు అలాగే 72మందికి ఈసీజీ ఎకో గుండె సంబంధించిన పరీక్షలు ఉచితముగా చేసి, 70మందికి పి సి టి, మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ సంబంధిత క్యాన్సర్ పరీక్షలు చేసి, తగిన మందులు ఉచితముగా అందచేశారు. ఈ కార్యక్రమమునకు ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.వి. సత్యనారాయణ, సెక్రటరీ లక్ష్మీనారాయణ రెడ్డి, ట్రెజరర్ చలువాది మోహన్ రావు, సి. హెచ్. మల్లిక్, ఎం. వీరశేఖర్, పామర్తి కేశవరావు, బత్తెన శ్రీనివాస్, నారాయణ రెడ్డి, బొగ్గవరపు తిరుపతయ్య, పొన్నూరు రామకృష్ణ, కోలా వెంకటేశ్వరరావు, జె.వి.లక్ష్మీనారాయణ, ఘంటా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవముగా శ్రీ లక్ష్మీ గణపతి హోమం




**గుడివాడ,జూలై 14 (వార్తాప్రభ) :** మెయిన్ రోడ్ లో వెంచేసియున్న శ్రీ విగ్నేశ్వర స్వామి వారి దేవస్థానం లో సోమవారం ఆషాడ మాసం బహుళ చవితి సంకట హర చతుర్థి పర్వదినం సందర్భముగా శ్రీ స్వామి వారి ఆలయ కాలక్షేప మండపం నందు వేదపండితులచే శ్రీ లక్ష్మీ గణపతి హోమం పూజా కార్యక్రమం అత్యంత వైభవముగా నిర్వహించారు. ఈహోమం పూజలో 105 మంది ఉభయ దాతలు పాల్గొని పూజలు జరిపించు కున్నారు. ఈ సందర్భముగా ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్ చైర్మన్, సభ్యులు లోయ వాసు, పంచమర్తి శ్రీనివాసరావు, విక్కుర్తి పోతురాజు, వీరమాచనేని శైలజ, శలంకాయల లీలాకుమారి, ఎరుకపాటి సుశీల మరియు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వై. శ్రీనివాసరావు (వాసు) లు ఉభయదాతలకు ప్రసాదాలు శేష వస్త్రం, జాకెట్టు అందచేసారు.

## గుడివాడ మండల ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం ఎంపిక




**గుడివాడ,జూలై 14 (వార్తాప్రభ) :** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) గుడివాడ మండలం మహాసభ స్థానిక సుందరయ్య భవన్లో నిర్వహించారు. ఈ మహాసభలో 12 మంది నూతన గుడివాడ మండల కమిటీ ఏర్పాటైంది. ఎస్ఎఫ్ఐ గుడివాడ మండల అధ్యక్షులుగా ఎ.జగన్, కార్యదర్శిగా నాగేంద్రబాబు, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు సాత్విక్ ప్రసాద్, అవినాష్ ఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శులు సాయి పవన్, జై గణేష్, రుదేవ్, మండల కమిటీ సభ్యులు నవదీప్ సాద్విక్ జెన్నీఫా రవీంద్ర అర్జున్ తేజ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్. సమరం మాట్లాడుతూ నూతన మండల కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ.. గుడివాడ మండలంలో విద్యార్థినీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందలేదని స్కూల్లో చదువుకునే విద్యార్థిని విద్యార్థులను ఆ పాఠ్యపుస్తకాన్ని జిరాక్స్ తీయించాలని ఉపాధ్యాయులు ఒత్తిడి తీసుకురావడం జరుగుతుందని దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించాలి విద్యాశాఖ మంత్రి స్పందించి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే ప్రతి విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని తల్లికి వందన అమలు చేయాలని పీజీ విద్యార్థులకు డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీమిక్స్ కల్పించాలని మరో మారు కోరుకుంటూ ఈ ప్రభుత్వానికి ఒక విన్నపం చేయడం జరుగుతుంది. ఈ విన్నపాన్ని ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ సమస్యలపై చర్యలు తీసుకుంటారని ఆశిస్తూ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు సలీం, ఎస్ఎఫ్ఐ కృష్ణ జిల్లా సహాయ కార్యదర్శి హారిక విద్యార్థులు పాల్గొన్నారు.

## గౌతమ్ స్కూలు విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన సదస్సు



**గుడివాడ,జూలై 14 (వార్తాప్రభ) :** డిఎస్పీ ధీరజ్ వినీల్ ఆదేశాల మేరకు గౌతమ్ స్కూలు విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన, మత్తు పదార్థాలు మరియు కాల్ మనీ మొదలగు అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ట్రాఫిక్ ఎస్ఐ పి. నాగరాజు మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ మరియు రెగ్యులేషన్స్ గురించి తెలియజేసారు.. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి వాహనాలు నడపాలని, మైనర్లు డ్రైవింగ్ చేయరాదని, ట్రిపుల్ రైడ్, సెల్ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. డ్రగ్స్ పై అవగాహన కల్పించి విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు సేవించిన ఎడల అనారోగ్యంతో బాధపడటమే కాకుండా మత్తు పదార్థాలు సేవించిన వారిపై పోలీస్ కేసులు బుక్ చేసి రౌడీషీట్ ఓపెన్ చేస్తారని, కావున విద్యార్థులు డ్రగ్స్ కి దూరంగా ఉండాలని తెలియపరుస్తూ మరియు మత్తు పదార్థాల గురించి సమాచారం తెలిసిన యెడల పోలీస్ వారికి తెలియపరచవలసినదిగా కోరినారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్ ఈజీ మనీ కి అలవాటు పడి యాప్ లు గాని, లింకులు గాని క్లిక్ చేయరాదని, సైబర్ సెక్యూరిటీ పై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా సమస్యలు ఎదురైనపుడు 1930 కాల్ గురించి, డయల్ 112 కాల్ ఉపయోగం, వాటి వినియోగం గురించి అవగాహన కల్పించినారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాజీ మున్సిపల్ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి.. మిఠాయిలు తినిపిస్తున్న నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్.. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులు నందూరి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.
గుడివాడ,జూలై 14 (వార్తాప్రభ) :

## విద్యార్థులకు స్టేషనరీ ఐటమ్స్ పంపిణీ..




**గుడివాడ,జూలై 14 (వార్తాప్రభ) :** రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో నందివాడ మండలం, తమిరిశ శివారు గ్రామం అంబేద్కర్ నగరులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు రమారమీ 3వేల రూపాయల విలువైన పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ గుడివాడ సెక్రటరీ గుళ్లపల్లి కిరణ్ బాబు వితరణ అందించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ ఎం వల్లూరిపల్లి ధనంజయ్ మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సహాయాన్ని వినియోగించుకుని విద్యార్థులు చదువులో అగ్రగామిగా నిలవాలన్నారు. దాత కిరణ్‌బాబును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు యలమంచిలి నాగేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ ముళ్ళపూడి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నోరు అదుపులో పెట్టుకో... లేకుంటే మళ్ళీ గుణపాఠం తప్పదు..

● పేర్ని నానీ ని హెచ్చరించిన జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ



**పెడన,జూలై 14 (వార్తాప్రభ) :** ప్రశాంతంగా ఉన్న ఆంధ్రప్రదేశ్లో వైసిపి మాజీ నాయకులు అలజడి సృష్టించి విధ్వంసం జరిగేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు మాజీ మంత్రి పేర్నినాని చేస్తున్నాడని పోలీసు యంత్రాంగం అంతా గమనిస్తూనే ఉందని అతనిపై చట్టపరమైన చర్యలు తప్పవని జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ హెచ్చరించారు. ఈ మేరకు తోట మూల సెంటర్లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బండి రెడ్డి మాట్లాడుతూ గత వైసిపి పాలకులు చేసిన రాద్ధాంతాన్ని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఇప్పుడిప్పుడే మర్చిపోతుంటే రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక సినిమాలో డైలాగును రప్ప రప్ప అనే నినాదాన్ని వైసీపీ గూండాలు మాట్లాడుతూ నియోజకవర్గంలో అలజడలు సృష్టించి రౌడీయిజాన్ని చేస్తున్నారని అన్నారు. పెడన నియోజకవర్గంలోకి వచ్చి ఒక బహిరంగ సభలో అరాచకమైన మాటలు పేర్ని నాని మాట్లాడాడని నియోజవర్గంలో భయానక అలజడులు సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నాడని పేర్కొన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో పేర్ని నాని నీ తన తనయుడిని చిత్తుచిత్తుగా ఓడించి ప్రజలు బుద్ధి చెప్పారు అన్నారు. వైసీపీ హయాంలో భారీ లిక్కర్ స్కాం ను అధికారులు బయటకు తీస్తున్నారని ఎటువంటి స్కామ్ లో ఉన్న వైసీపీ నాయకుడు పేరుని నాని స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఊచ వెంకయ్య మోటేపల్లి సురేష్ ర్యాలీ సత్యనారాయణ కునపురెడ్డి రంగయ్య పుల్లేటి దుర్గారావు,ప్రత్తిపాటి జయకృష్ణ వరదు రామకృష్ణ జన్యావుల నాగబాబు తదితరులు ఉన్నారు.

## బీసీ మహిళా ప్రజాప్రతినిధి కారు పై దాడి చేయడం అమానుషం - బత్తుల,కన్నమాల





**పెనుగంచిప్రోలు,జూలై 14 (వార్తాప్రభ) :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ మహిళా, కృష్ణా జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక కారు పై దాడి అమానుషమని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, ఎస్ సి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నమాల, శామ్యూల్ లు తెలిపారు. ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ కూటమి పాలనలో బీసీలకు రక్షణ లేకుండా పోయిందని,సాక్షాత్తు పోలీసుల సమక్షంలో కారులో ఉన్నటువంటి వారిని నిర్బంధించి వారి కారు పై టీడీపీ జనసేన పార్టీలకు చెందిన కొంత మంది వ్యక్తులు దాడి చేయటం బాధాకరనని అన్నారు, రాష్ట్రంలో కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలు గాలికొదిలేసి, రెడ్ బుక్ రాజ్యాంగం పేరిట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనీ టార్గెట్ చేస్తున్నారని పేరొన్నారు, ఒక బీసీ మహిళా నాయకురాలు తాను పని చేస్తున్న పార్టీ సమావేశానికి హాజరయ్యే హక్కు లేదా అని ఆయన ప్రశ్నించారు ఈ విధమైనటువంటి దాడులు రాష్ట్రంలో ఎప్పుడూ చూడలేదని దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని లేని యడల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ, ఎస్ సి,విభాగాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వీరు అన్నారు,

## ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో రైతులకు ప్రయోజనం యార్లగడ్డ





**హనుమాన్ జంక్షన్,జూలై 14 (వార్తాప్రభ) :** వైసిపి ప్రభుత్వం అనాలోచితంగా ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల రైతన్నకి తీరని నష్టం వాటిల్లుతుందని, రైతుల జరగబోయే నష్టాన్ని గమనించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ చట్టాన్ని రద్దుచేసి రైతులకు మేలు చేసినట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం బాపులపాడు మండలం కానుమోలు, ఆరుగొలను గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి జరుగుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాదికాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వల్ల రైతులుకు ఎంతో ప్రయోజనం కలిగిందన్నారు. ప్రభుత్వ రికార్డుల్లో రైతుల భూముల వివరాలు పొరపాటుగానో, గ్రహ పాటుగానో వేరే వారి పేరు నమోదు అయితే దానిని సరిదిద్దుకునే అవకాశం లేదన్నారు. వైసిపి ప్రభుత్వం రైతుల భూములు లాక్కునేందుకు ఈ విధమైన దుర్మార్గపు చట్టాన్ని ప్రవేశపెట్టిందని ఆరోపించారు. ఈ ఏడాది ముందుగానే సాగునీరు విడుదల చేసి ఖరీఫ్ సీజన్ ను సకాలంలో ప్రారంభించినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పథకాలతో పాటు సంక్షేమ పథకాలను సమపాళ్లలో అమలు చేస్తూ ప్రజల క్షేమమే ధ్యేయంగా చంద్రబాబు నేతృత్వంలో తమ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు చెప్పారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్న తనకు ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా యార్లగడ్డ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రంగయ్యప్పారావుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన తెలుగుదేశం పార్టీ జెండా స్థూపాన్ని యార్లగడ్డ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దయ్యాల రాజేశ్వరరావు, ఆళ్ళ గోపాలకృష్ణ, పుట్టా సురేష్, చిరుమామిళ్ల సూర్యం, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, నీటి సంఘాల అధ్యక్షులు నల్లిబోయిన గోపాలకృష్ణ, కాటుమల పృధ్వి, రాహుల్, పరుచూరి రామకృష్ణ, లింగం శ్రీధర్, మున్నంగి బాబురావు, చలమలశెట్టి శివకుమార్, చాలాసాని శ్రీనివాసరావు, తుమ్మల విష్ణు, ముల్పూరి సాయి కళ్యాణి, తుమ్మల బ్రహ్మం, చింతల వెంకట శివ అప్పారావు, చిన్నాల చిన్న, కాటూరి విజయభాస్కర్, యాజ్జవరపు రంగారావు, బొప్పన హరికృష్ణ, చిన్నలా చిన్న, పొట్లూరి ప్రసాద్ ఆయా గ్రామాల టిడిపి అధ్యక్షులు దన్నే మల్లికార్జునరావు, బేతా శేషు, దోనే రాము, పీ.ఏ.సి.ఎస్ అధ్యక్షులు దన్నే దుర్గారావు, బెత సుజాత, వేగిరెడ్డి పాపారావు, గండేపూడి నితీష్, సింగవరపు చంద్రమౌళి, గుండాపనేని ఉమా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పాల హారిక ఫిర్యాదుపై కేసు నమోదు..



**గుడివాడ,జూలై 14 (వార్తాప్రభ) :** కూటమి కార్యకర్తలు తనను అవమానించి, కారు అద్దాలు పగలగొట్టారని కృష్ణా జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక శనివారం అర్ధరాత్రి గుడివాడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని లింగవరంలో వైకాపా సమావేశానికి వెళుతుండగా కూటమి కార్యకర్తలు పట్టణంలోని నాగవరప్పాడులో తన కారు ఆపి దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చంపుతామంటూ బెదిరించారని, తన కారును కదలనివ్వకుండా అసభ్య పదజాలంలో దూషించారన్నారు. దీంతో పోలీసులు 126(2), 292, 324(4), 351(2) రెడ్విత్ 3(5) బీఎన్ఎస్ కింద కేసులు నమోదు చేశారు.

## నాగేశ్వరరావుకు ఎమ్మెల్యే ఘన నివాళి



**కోడూరు,జూలై 14 (వార్తాప్రభ) :** కోడూరు మండలం పోటుమీద గ్రామంలో మాజీ సర్పంచ్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కడవకొల్లు నాగేశ్వరరావు భౌతిక కాయాన్ని సోమవారం ఉదయం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగేశ్వరరావు మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నాగేశ్వరరావుతో తమకున్న అనుబంధం స్మరించుకున్నారు ఆయన వెంట భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, కూటమి నాయకులు ఉన్నారు.

## వాసవి జాగృతి క్లబ్ గుడివాడ వారిచే వ్యాపారస్తులకు చిరు సత్కారం..



**గుడివాడ,జూలై 14 (వార్తాప్రభ) :** వాసవి జాగృతి ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా॥ తిరువీధి వేణుగోపాల్ ఆదేశాల మేరకు జులై 14వ తారీకున వ్యాపారస్తుల దినోత్సవంగా ప్రకటించడం అందులో భాగంగా గుడ్లవల్లేరు విజయ సూపర్ మార్కెట్ అధినేతకు చిరు సత్కారం చేయడం జరిగింది. అలాగే గుడివాడ లో శ్రీ దుర్గాంబిక కిరాణా మర్చంట్ ప్రొ॥ కాళ్లేపల్లి వీర వెంకట సత్యనారాయణ బాలాజీ స్వామికి మరియు కిరాణా మర్చంట్ వరద శివకుమార్ లకు సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శేగు వెంకట ప్రసాద్ బబిత కార్యదర్శి కంతేటి హరినాథ్ బాబు నేత్రదాన ప్రోత్సాహకులు (డిస్టిక్ కో ఆర్డినేటర్) గాదె మోహన్ బాబు క్లబ్ సభ్యులు బచ్చు జగన్ వెంకట మురళీకృష్ణ పాబోలు వీర వెంకట సత్యనారాయణ చిట్టూరి శ్రీనివాసరావు చిట్టూరి కృష్ణమోహన్ కొత్త వెంకట కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

## వైషమ్యాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్న పేర్ని నానీపై చర్యలు తీసుకోవాలి

-పేర్ని నాని దిష్టిబొమ్మ దహనం.




**చల్లపల్లి/అవనిగడ్డ,జూలై 14 (వార్తాప్రభ) :** వైషమ్యాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్న వైకాపా జిల్లా అధ్యక్షుడు పేర్ని నానీపై చర్యలు తీసుకోవాలని టిడిపి శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాని దిష్టిబొమ్మను దహనం చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, చల్లపల్లి సర్పంచ్, తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, ఏఎంసీ డైరెక్టర్ ఇబ్రహీం, టీడీపీ నాయకులు నాదెళ్ల వెంకట నరసయ్య, వాసిరెడ్డి రాకేష్, గుత్తికొండ వంశీ, శివరామకృష్ణ, జన్ను నాంచారయ్య, షేక్ సిలార్ ,తాతా ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణమ్మ తీరాన కుంచెతో కోటి భావాలు!

● ఉత్సాహంగా ఫ్లోర్ పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు ● వైబ్రెంట్ విజయవాడకు ఈ అడుగే గొప్ప స్ఫూర్తి ● హరిత బెరం పార్కులో ప్రతి వారం సృజనాత్మక కార్యక్రమాలు ● పర్యాటక ప్రాంతాల్లోనూ వినూత్న కార్యక్రమాలు ● ప్రజలు, పర్యాటకులు పెద్దఎత్తున భాగస్వాములు కావాలి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ









**విజయవాడ,జూలై 14 (వార్తాప్రభ) :** జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో హరిత బెరం పార్కు కృష్ణా తీరంలో జరిగిన ఫ్లోర్ పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల్లో 300 మందికి పైగా యువత, చిన్నారులు పాల్గొని.. తమ కళా ప్రతిభను ప్రదర్శించారు. స్వర్ణాంధ్ర విజన్ ఏ 2047, పీ4 (ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజా భాగస్వామ్యం) విధానం, సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, స్వచ్ఛంధ్ర, సేవ్ వాటర్, రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్, హరితాంధ్ర అంశాల్లో వేసిన వర్ణ చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తమ చిత్ర కళా నైపుణ్యాన్ని వెలికితీసి ప్రజలను జాగ్రత్యం చేసేలా వేసిన చిత్రాలు, కొత్త శోభను సంతరించుకున్న కృష్ణా తీరం స్ఫూర్తి వైబ్రెంట్ విజయవాడకు తొలి అడుగు అని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల్లో కనిపించిన ఉత్సాహంతో విజయవాడ గెలిచిందని.. ఈ విజయం అందించిన ఉత్సాహంతో ప్రతివారం హరిత బెరం పార్కులో సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఫొటోగ్రఫీ, యోగా, స్విమ్మింగ్.. ఇలా వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తామని.. వీటిలో నగర ప్రజలు, పర్యాటకులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. భవానీ ఐలాండ్‌లో బర్డ్ ఫొటోగ్రఫీ పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమేనని ఈ పోటీల్లో పాల్గొనడమే ప్రధానమని పేర్కొన్నారు. జిల్లాలోని పవిత్ర సంగమం, కొండపల్లి ఖిల్లా, గాంధీహిల్స్ తదితర పర్యాటక ప్రాంతాల్లోనూ వివిధ రకాల థీమ్స్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సెలవు రోజులను చిన్నారులు సద్వినియోగం చేసుకొనేలా వారిలో మంచి ఆలోచనలు వచ్చేలా ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. ఈ మంచి ఆలోచనల ఆహ్లాదకర వాతావరణం స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాల సాధనకు ఉపయోగపడతాయన్నారు. కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్-2024 పురస్కారాల్లో విజయవాడ నగరం సూపర్ స్వచ్ఛతా లీగ్ అవార్డును గెలుచుకున్నందుకు నగర ప్రజలకు, నగరపాలక సంస్థ అధికారులు సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. లివిజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం మాట్లాడుతూ చిన్నారులు, యువత పర్యావరణం, జల వనరులు, కాలుష్య దుష్పరిణామాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకునేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతివారం వివిధ రకాల ఇతివృత్తాలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడకు సూపర్ స్వచ్ఛతా లీగ్ పురస్కారం లభించడానికి ప్రతిఒక్కరి కృషి కారణమని తెలిపారు.

**పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం:** పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల విజేతలకు కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఫ్లోర్ పెయింటింగ్ విభాగంలో సేవ్ వాటర్ పెయింటింగ్‌తో జి.తనూజ మొదటి స్థానంలో నిలిచి రూ. 10 వేల నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందుకుంది. ద్వితీయ బహుమతి (రూ. 7,500)ని పి.యామినీ విశాల, తృతీయ బహుమతి (రూ. 5,000)ను వి.జశ్వంతి, నాలుగో బహుమతి (రూ. 3,000)ని ఎం.సురేష్ పొందారు. ఫ్లోర్ పెయింటింగ్‌లో ఎల్.శ్వేత, పి.రచన, వి.అనురాధ, కె.హవీలా జెన్నీ, బి.రోహితలు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. డ్రాయింగ్ పోటీల్లో ఎంఎస్ వైష్ణవ్య తొలి బహుమతి అందుకోగా రెండు, మూడు, నాలుగో స్థానాల్లో రాహిల్ జయాన్, జి.భాష్యశ్రీ , లక్ష్ జైన్ నిలిచారు. టి.క్రిష్, జి.ఇషికా కృష్ణన్, జి.ఆధ్వి, సాక్షం సుతార్, రామిరెడ్డి జశ్వితలు ప్రోత్సాహక బహుతులు అందుకున్నారు. పోటీలకు కళానిపుణులు పి.చిదంబరేశ్వరరావు, కళాసాగర్, పి.రమేష్, సంతోష్ కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ పి.కృష్ణచైతన్య, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని, జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, ఆయుష్ అధికారి డా. రత్నప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ గా నియమితులైన డా. పి.చంద్ర శేఖర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన విద్యుత్ బిసి ఎంప్లాయిస్ జనరల్ సెక్రెటరీ ముప్పసాని రామక్రిష్ణ, డా. అన్వేష్, డా.హారిక లతో పాటు యాదవ సంఘ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్, న్యూట్రిషనీస్ట్ వి.సుధాకర్ యాదవ్
-విజయవాడ,జూలై 14 (వార్తాప్రభ) :

## రాష్ట్రంలో అరాచకాలు వైసీపీ లక్ష్యం - ఎమ్మెల్యే కాగిత



**పెడన,జూలై 14 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో అరాచకాలు సృష్టించడమే వైసిపి లక్ష్యమని ఐదేళ్లలో వైసిపి పాలన వల్ల రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని హింస రాజకీయాలే ప్రవృత్తిగా వైసీపీ నాయకులు చేస్తున్నారని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని మండల పరిధి మడక గ్రామంలో నిర్వహిస్తూ పాత్రికేయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హింస రాజకీయాల కోసమే వైసిపి నాయకులు ఉన్నారని మొన్న జరిగిన జిల్లా పరిషత్ చైర్మన్ దాడి కావాలని వైసిపి నాయకుడు ఉప్పాల రాము వెనక్కి వచ్చి టిడిపి నాయకులను రెచ్చగొట్టారని అన్నారు. పోలీసులు వారించిన జగన్మోహన్ రెడ్డి సూచనల మేరకు మరల వెనక్కి తిరిగి వచ్చి హింస రాజకీయాలను ఉప్పల రాము ప్రేరేపించాడని పేర్కొన్నారు.రాష్ట్రా అభివృద్ధిని చూసి ఓర్వలేని జగన్ మోహన్ రెడ్డి తన నాయకులతో అనేక రకాల హింస కార్యక్రమాలు చేపడుతున్నాడని అన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వం నడుస్తోంది రాజ్యాంగబద్ధంగా పాలన కూడా నడుస్తున్ననేపథ్యంలో వైసిపి గుండాలు అలజడి సృష్టించి హింసకు ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. ప్రజల కోరుకున్న ప్రభుత్వాన్ని ఎలాగైనా నిర్వీర్యం చేయాలనే ఇటువంటి హింస రాజకీయాలు మాజీ మంత్రి పేర్ని నాని కూడా రెచ్చగొడుతున్నాడని ప్రజలు మరలా బుద్ధి చెప్పే సమయం దగ్గరలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి అర్జ నగేష్ మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి సీరం ప్రసాదు దావోజిపాలెం నందమూరు పి ఎ సి ఎస్ అధ్యక్షులు కాగిత నాగేశ్వరావు మన్నే శ్రీనివాసరావు పరసా రాంబాబు పరసా కామేశ్వరావు గంధం గోపాలకృష్ణ పంద్రాజు లక్ష్మణరావు ఊసా మారుతీ అంకెం వీర వెంకటేశ్వరావు మడక పాలకేంద్రం అధ్యక్షులు జోగి సుబ్బారావు పామర్తి నాగరాజు తదితరులు ఉన్నారు.

## సుపరిపాలన లో భాగంగా ఇంటింటి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ



**పెనుగంచిప్రోలు,జూలై 14 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు భాగంగా ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న కరపత్రాలను గవర్నమెంట్ హాస్పటల్ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ చుంచు రమేష్, కనపర్తి వేణు, కలక సుబ్బారావు, గేరా దాసు,ముక్కు ఆంజనేయులు, కంకణాల శ్రీనివాసరావు, చింతల పాండవులు,171 వ బూత్ కన్వీనర్ మహమ్మద్ ఆజాద్, తదితరులు పాల్గొన్నారు,

## కామినేనిలో విజయవంతంగా అరుదైన ఈఎన్టీ శస్త్రచికిత్స

● రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో రోగి చెవి వెనుక భాగంలో ఎముకకు గాయం
● దెబ్బతిన్న ఎముక ప్రభావంతో నరం నొక్కుకుపోయి వంకరపోయిన రోగి ముఖం
● ట్రొమాటిక్ ఫేషియల్ నెర్వ్ పాల్సీ సమస్యకు అత్యంత క్లిష్టమైన సర్జరీతో పరిష్కారం
● కేవలం 21 రోజుల వ్యవధిలో పేషెంటును పూర్తిగా కోలుకునేలా చేసిన కామినేని హాస్పిటల్ చెవి, ముక్కు, గొంతు శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ పి. సునీల్ కుమార్




**విజయవాడ,జూలై 14 (వార్తాప్రభ) :** అత్యంత అరుదైన ఈఎన్టీ శస్త్రచికిత్సను కామినేని హాస్పిటల్స్ లో విజయవంతంగా నిర్వహించారు. ప్రఖ్యాత చెవి, ముక్కు, గొంతు శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ పి. సునీల్ కుమార్ సాధించిన ఈ విజయం కామినేని విజయప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచిపోతుందని హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ఆర్.ఎస్. వర్ధన్ పేర్కొన్నారు. అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా, సదరు చికిత్స వివరాలను తెలియజేసేందుకు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నగరంలోని ఇంద్రప్రస్థ హోటల్లో సోమవారం జరిగిన ఈ సమావేశంలో డాక్టర్ ఎన్.ఆర్.ఎస్. వర్ధన్ మాట్లాడుతూ.. సాధారణంగా ఈ తరహా కేసుల్లో శస్త్రచికిత్స అనంతరం పేషెంట్ కోలుకోవడానికి కనీసం ఆరు నెలల సమయం పడుతుందని తెలిపారు. అయితే, డాక్టర్ సునీల్ కుమార్ అద్భుత నైపుణ్యం ఫలితంగా కేవలం 21 రోజుల్లోనే పేషెంట్ సాధారణ స్థితికి చేరుకోవడం అద్భుతమైన విషయంగా చెప్పుకోవచ్చని అన్నారు. అతి సంక్లిష్టమైన శస్త్రచికిత్సను అత్యంత కచ్చితత్వంతో నిర్వహించి విజయం సాధించిన డాక్టర్ సునీల్ కుమార్ అభినందనీయులని అన్నారు. ఈ విజయం కామినేని కీర్తి కిరీటంలో మరో కలికితురాయిగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం, ఈఎన్టీ శస్త్రచికిత్సా నిపుణులు డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ.. "రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు కామినేని న్యూరాలజీ విభాగంలో అడ్మిట్ అయ్యాడు. చికిత్స కొనసాగుతుండగా, మూడు రోజుల తర్వాత పేషెంట్ ఆరోగ్య పరిస్థితిలో కొన్ని మార్పులు సంభవించాయి. ముఖం వంకర పోవడం, కనురెప్పల్లో కదలిక లేకపోవడం వంటి లక్షణాలను పేషెంట్లో గుర్తించాం. ప్రమాదానికి గురైనప్పుడు చెవి వెనుక భాగంలోని టెంపోరల్ బోన్ దెబ్బతింది. దెబ్బతిన్న ఈ ఎముక ముఖ భాగానికి సంబంధించిన కీలక నరాన్ని నొక్కివేయడంతో రోగికి పైన పేర్కొన్న ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. ఈ పరిస్థితిని ట్రొమాటిక్ ఫేషియల్ నెర్వ్ పాల్సీగా వ్యవహరిస్తాం. అత్యంత సంక్లిష్టమైన ఈ సమస్యను పరిష్కరించేందుకు అత్యంత కచ్చితత్వంతో శస్త్రచికిత్స నిర్వహించాల్సివుంటుంది. స్వల్ప తేడాలున్నా శస్త్రచికిత్స సరైన ఫలితాలను ఇవ్వకపోవచ్చు. దాదాపు నాలుగు గంటలు పైగా శ్రమించి విజయవంతంగా సర్జరీ పూర్తి చేశాం. దెబ్బతిన్న ఎముకను సరిచేసి, ఒత్తిడికి గురవుతున్న నరాన్ని సాధారణ స్థితికి తీసుకురాగలిగాం. ఈ తరహా కేసుల్లో రోగులు కోలుకుని సాధారణ స్థితికి చేరుకోవడానికి కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. కానీ, అత్యంత కచ్చితత్వంతో సర్జరీ నిర్వహించడం ద్వారా 21 రోజుల్లోనే పేషెంట్ పూర్తిగా సాధారణ స్థితికి వచ్చారు" అని తెలిపారు. ఇటువంటి సంక్లిష్టమైన శస్త్రచికిత్సను అత్యంత ప్రభావవంతంగా పూర్తి చేయడం, పేషెంట్ అతి తక్కువ వ్యవధిలోనే సాధారణ స్థితికి చేరుకోవడం తమ కృషికి దక్కిన గొప్ప విజయంగా డాక్టర్ సునీల్ కుమార్ పేర్కొన్నారు. కామినేని హాస్పిటల్స్ నందు అత్యాధునిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన నిపుణులతో కూడిన వివిధ వైద్య విభాగాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను ప్రజలందరికీ చేరువ చేయడమే లక్ష్యంగా కామినేని హాస్పిటల్స్ కృషి చేస్తోందని డాక్టర్ సునీల్ కుమార్ వెల్లడించారు. చికిత్సానంతరం కోలుకున్న పేషెంట్ ఈ సమావేశంలో మాట్లాడుతూ.. ప్రమాద ఫలితంగా దిక్కుతోచని స్థితిలో ఉన్న తనకు డాక్టర్ సునీల్ కుమార్ పునర్జీవితం ప్రసాదించారని అన్నారు. డాక్టర్ సునీల్ కుమార్ తో పాటు కామినేని వైద్య బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో కామినేని మార్కెటింగ్ హెడ్ కె.ఆర్. రమణారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఏఎంసీ డైరెక్టర్ ఆదినారాయణ సన్మానం



**కోడూరు, జూలై 14 (వార్తాప్రభ) :** దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టరుగా నియమితులు అయిన కోడూరు మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు జరుగు ఆదినారాయణ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదును ఘనంగా సత్కరించారు. సోమవారం సాయంత్రం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుద్ధప్రసాదును, నియోజకవర్గ యువనాయ కులు మండలి వెంకట్రామ్ లను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనను ఏఎంసీ డైరెక్టర్ పదవికి సిఫార్సు చేసిన సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి దామోదర్, టౌన్ అధ్యక్షులు కోట రాంబాబు, టీసీ రేపల్లె రవీంద్ర, లింగారెడ్డిపాలెం ఉప సర్పంచ్ బషీర్ మొహిద్దీన్, లింగారెడ్డిపాలెం గ్రామ కన్వీనర్ దాసరి వెంకట కృష్ణారావు, పార్టీ నాయకులు పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు, పూతబోయిన కరుణకుమార్, సిద్దినేని అశోక్ నాయుడు, అప్పికట్ల వినోద్, కోట సుబ్బారావు, అబ్దుల్ లతీఫ్, జరుగు లక్ష్మణ, జరుగు సాంబశివరావు, అప్పికట్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ తిరుపతమ్మ అమ్మవారి కి సారె సమర్పించిన పెనుగంచిప్రోలు పోలీసులు..




**పెనుగంచిప్రోలు, జూలై 14 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ పెనుగంచిప్రోలు ఎస్ఐ,అర్జున్,శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం, దేవస్థానం అధికారులు వేద పండితుల ఆశీర్వచనం, స్వామివారి శేష వస్త్రం తీర్థప్రసాదాలు అందజేశారు, ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వరరావు దంపతులు,పెనుగంచిప్రోలు ఎస్ఐ అర్జున్ దంపతులు,వత్సవాయి ఎస్ఐ,ఉమామహేశ్వరరావు, చిల్లకల్లు ఎస్ఐ సూర్య శ్రీనివాస్ మరియు పెనుగంచిప్రోలు పోలీస్ సిబ్బంది పాల్గున్నారు...

## పదవి అంటే బాధ్యత.... అలంకారం కాదు



**కంకిపాడు,జూలై 14 (వార్తాప్రభ) :** పదవి అంటే అలంకారం కాదు బాధ్యతగా పనిచేయాలని పెనమలూరు నియోజకవర్గం శాసనసభ్యులు బోడె ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో పి.ఎ. సి .ఎస్ చైర్మన్ గా, డైరెక్టర్లుగా జి. జైరామ్, డి నాగేశ్వరరావుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడె ప్రసాద్ పాల్గొని డైరెక్టర్, చైర్మన్ ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనం పదవిలో ఉన్నాము అంటే బాధ్యతగా పనిచేసే కూటమి ప్రభుత్వానికి పేరు తెచ్చేలాగా వ్యవహరించాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించి, బ్యాంకు ఆదాయం పెంచే దిశగా పనిచేయాలని పేర్కొన్నారు. పదవి రాలేదని ఎవరు అసంతృప్తి చెందకండి, రెండో విడత జాబితాలు అవకాశాలు వస్తాయి తప్పనిసరిగా గుర్తించి అవకాశం కల్పిస్తామని కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎన్.రాజ్యలక్ష్మి, సర్పంచ్ బాకీ రమణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కళ్యాణి, సిహెచ్ సి చైర్మన్ బి రోహిణి కుమారి, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, జనసేన రాష్ట్ర కార్యదర్శి రాజేష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, జనసేన సీనియర్ నాయకులు ముప్పా రాజా, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శక్తి టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన



**పెనుగంచిప్రోలు, జూలై 14 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడు గ్రామంలో గల జిల్లా ప్రభుత్వ పాఠశాల నందు యన్.టి.ఆర్ జిల్లా సిపి, ఆదేశానుసారంగా నందిగామ ఏసిపి, ఉత్తర్వుల మేరకు,జగ్గయ్యపేట సిఐ పర్యవేక్షణలో శక్తీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ మరియు శక్తి యాప్ పై అవగాహన కల్పించడం జరిగింది.విద్యార్థినుల పై సమాజంలో జరుగుతున్న దాడులు,వాటిని ఏ విధంగా ఎదురుకోవాలోనని,శక్తి యాప్ ఏ విధంగా ఉపయోగపడుతుందోనని విద్యార్థినిలకు శక్తి టీం ఏయస్ఐ బి హనుమయ్య వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## జులై 20 న శ్రీ భగవతి రేణుక ఎల్లమ్మ తల్లి నల్ల పోచమ్మ తల్లి బోనాల జాతర: బి. సి.నేత భేరి



**హైదరాబాద్,జూలై 14 (వార్తాప్రభ) :** నేతాజీ నగర్ కాలనీలో జులై 20వ తేదీ ఆదివారం నాడు శ్రీ భగవతీ రేణుక ఎల్లమ్మ నల్ల పోచమ్మ ఆలయంలో బోనాల పండుగ నిర్వహించడం జరుగుతుందని కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నేతాజీ నగర్ కాలనీలో ఉన్న ప్రతి ఇంటి నుండి రెండు బోనాలు ఒకటి రేణుక ఎల్లమ్మ తల్లికి రెండవది నల్ల పోచమ్మ తల్లికి సమర్పించుకోవాలని తెలిపారు. స్వయంభుగా వెలసిన శ్రీ భగవతి రేణుక ఎల్లమ్మ తల్లి నల్ల పోచమ్మ తల్లులకు మనస్ఫూర్తిగా నియమనిష్ఠలతో బోనాలు సమర్పించుకొని ఆ దేవతల కరుణ కృపా కటాక్షాలు పొందాలని అన్నారు. ఆ తల్లి కృపకు మీరు పాత్రులైతే విద్యావంతులవుతారు, ఆరోగ్యవంతులవుతారు, వృత్తులపరంగా అభివృద్ధి చెందుతారన్నారు. పాడిపంటలు ఘనంగా పండుతాయనీ, వ్యాపారం అంతకంతకు అభివృద్ధి చెందుతుందని అన్నారు. కాలనీలో ఉన్న ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ తల్లి కృపకు పాత్రులు కావాలని అన్నారు. ఆలయ కమిటీ సమావేశంలో పాల్గొన్న కాలనీ పెద్దలు, మహిళా సోదరీమణులు మరియు యువజన నాయకులు కే నరసింహ యాదవ్, రవి నాయక్, రాయుడు, జయ రెడ్డి, రాధారాన్ రెడ్డి, లాల్ రెడ్డి, అన్నదొర ప్రసాద్ చారి, అంజిరెడ్డి, గంగమ్మ, సత్తెమ్మ, మనీ మేఘమాల, రాములు నాయక్, నరేష్ నాయక్, సురేష్ నాయక్, దశరథ్ నాయక్, గణేష్ నాయక్, రాజు నాయక్, విట్టల్ నాయక్, డీజే భువన్, లవణాచారి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఠాగూర్ గ్రంథాలయం కు ఐరన్ గ్లాస్ డోర్ బీరువా బహుకరణ..



**విజయవాడ, జూలై 14 (వార్తాప్రభ) :** ఠాగూర్ గ్రంథాలయమునకు ఆర్ అండ్ బి లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేయుచున్న ముక్కొల్లు హరిబాబు మరియు వారి శ్రీమతి శశిరేఖ ఆర్ అండ్ బి లో డిప్యూటీ ఇంజనీర్ గా పని చేయుచున్న దంపతులు 20వేల రూపాయల విలువచేసే గ్లాస్ డోర్ ఐరన్ బీరువా బహుకరించారు. శశిరేఖ కు వారి ఇంటిలోనే చిన్న లైబ్రరీ లాగా పెట్టాలని కోరిక కలదు. ఇంటిలో పెట్టిన పదిమంది కి ఉపయోగపడదు, కాబట్టి పబ్లిక్ లైబ్రరీకి ఇస్తే విద్యార్థులకు ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో వారి ఇంటిలో ఉన్న పుస్తకాలు మరియు అవి పెట్టుకుంటానికి ఒక బీరువా గ్రంథాలయానికి బహుకరించారు. గ్రంథాలయాధికారి కే రమాదేవి ఆ దంపతుల ఇరువురిని దుస్సాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాఠకులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188